# సహస్రాబ్ది సామ్రాజ్యం

ప్రభువు వచ్చినప్పుడు ఆయన భూమిపై అడుగు మోపునా?



# Millennial Reign

When the Lord comes, will He set His foot on earth?

# సహస్రాబ్ది స్వామ్యం

ప్రభువు వచ్చినప్పుడు ఆయన భూమిపై అడుగు మోపునా?

# సహస్రాబ్ది సామ్రాజ్యం

ప్రభువు వచ్చినప్పుడు ఆయన భూమిపై అడుగు మోపునా?

P.I. Sabbathi

**SATYA VANI**
Post Box - 80
Kakinada – 533001

First published in 1986

sabbathi@outlook.com

"నీ ప్రవర్తన అంతటిలో దేవుని **అధికారానికి** అంగీకరించు"

సామెతలు 3:6

క్రీస్తు విజయ ధ్వనితో వచ్చి – గృహానికి నన్ను జేర్చగ
నా మది హర్షంతో నిండి – వినమ్రంగా నిన్ను ఆరాధించెద
ఓ రక్షకా, నీ స్తుతి పాడెద – నా ఆత్మతో మహా దేవా!
ఓ రక్షకా, నీ స్తుతి పాడెద – నా మనస్సుతో మహా దేవా!

# విషయ సూచిక


## రాజ్యాన్ని వెతకండి—

1. ఇశ్రాయేలీయుల రాజ్యపాలన వ్యవస్థ
2. మెస్సీయ కొరకు ఇశ్రాయేలీయుల నిరీక్షణ
3. మెస్సీయ కొరకు యూదుల నిరీక్షణ
4. దావీదు సంతానం – క్రీస్తు
5. క్రీస్తు రాజ్యాన్ని గూర్చిన అపోహలు
6. క్రీస్తు రాజ్యం ఆత్మ సంబంధమైంది
7. ప్రవచనాల్లో క్రీస్తు రాజ్యం
8. రాజ్యాన్ని గూర్చి క్రీస్తు బోధలు
9. రాజ్య స్థాపనకు అనువైన సమయం
10. రాజ్యం శక్తితో స్థాపించబడింది
11. రాజ్యం – సంఘం ఒక్కటే
12. రాజు – రాజ్య నివాసులు
13. రాజ్యం లోనికి ప్రవేశం

## నీతిని వెతకండి—

తమరు ఒక విజేత!

## క్రీస్తు ప్రత్యక్షతలో రాజ్యం ఏమి ఔతుంది?

1. పిమ్మట భూగోళం ఏ మౌతుంది?
2. క్రొత్త ఆకాశం – క్రొత్త భూమి
3. ప్రకటన 20:1–6 సంగతి ఏమిటి?
4. ప్రకటన 20:1–6 యొక్క పద పఠనం
5. పునరుత్థాన దేహం

"పరలోకము ప్రభు దేశము – పరదేశి నే నిల
మాయ లోకమే గదా – నేను యాత్రికుడను!

ఎంతో అందమైనది పరలోకము
అసమానమైనది దివ్య దేశము
విశ్వాసముతో సదా నేను యాత్రను సాగింతును.

దూతలు పాడుచుందురు పరమందున
దివా రాత్రము లందు పాడుచుందురు
పావనుని చూచి నేను హర్షింతును నిత్యము.

రక్షకుని చెంతకు ఎప్పు డేగెదన్
వీక్షించెద నెప్పుడు నాదు ప్రియుని
కాంక్షించెద నా మదిలో ఆయన చెంత నుండ.

అద్దరికి ఎప్పుడు నేను వెళ్లెదన్
అగుపడుచున్నది గమ్యస్థానము
అచ్చటనే చూచెదను పరిశుద్ధు లెల్లరిన్.

నిత్యానంద ముండును పరమందున
నీతి సమాధానము ఉండు నచ్చట
పొందెదను విశ్రాంతిని శ్రమ లన్నియు వీడి."

"ఓ సంఘమా సర్వాంగమా! స్వర్గ రాజ్యపు ప్రతిబింబమా!
మెస్సీయను ఎదుర్కొనగా నీతి నలంకరించి సిద్ధపడుమా!"

# సహస్రాబ్ది స్వామ్యం

నేటి లోకంలో క్రీస్తువులు తమ బోధల విషయంలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాల్ని వ్యాఖ్యానాల్ని వ్యక్తం చేస్తుంటారు. పవిత్ర లేఖనాల్లో ఉన్న ఏక స్వరం వీరి బోధల్లో కన్పించదు.

కొన్ని సంఘ శాఖలు (ఒనొమేసియ - ονομασία – denomination) క్రీస్తు రాజ్యాన్ని గూర్చి విభిన్నమైన బోధలు ప్రచురం చేస్తున్నాయి. క్రీస్తు శరీరధారిగా ఈ లోకానికి వచ్చినప్పుడు రాజ్యాన్ని స్థాపించాలనే సంకల్పంతోనే వచ్చాడు; కాని యూదులు ఆయన్ని తిరస్కరించటం వలన, రాజ్యాన్ని (బసిలేయ - βασιλεία) స్థాపించడానికి వీలుపడక —— దానికి ప్రత్యామ్నాయంగా తన సంఘాన్ని (ఎక్లేసియ - ἐκκλησία) స్థాపించారు అని అనేకులు బోధిస్తున్నారు.

"ఆద్య సహస్రాబ్ది స్వామ్యం" (premillennialism) లేక "తొలి వెయ్యేండ్ల పాలన" అనే మరొక సిద్ధాంతం కూడ నేడు ప్రాచుర్యంలో ఉంది—— దీని ప్రకారం ప్రభువైన క్రీస్తు తన లౌకిక రాజ్యాన్ని స్థాపించి, 1000 సంవత్సరాలు భూమిపై పరిపాలన చేస్తారు అని, ఈ పాలన "తుది తీర్పు" (final judgment) జరుగక ముందే ఉంటుంది అని

బోధిస్తుంటారు. క్రీస్తు మరల వచ్చి “యెరూషలేమును కేంద్రంగా చేసుకొని, అక్కడ తన లౌకిక రాజ్యాన్ని స్థాపించి, భూమిపై భౌతికంగా పరిపాలిస్తాడు” అని నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూదులు నమ్ముతున్నారు.

ప్రకటన 20వ అధ్యాయంలో అలంకార భాషలో వాడబడిన పదాల్ని సంఖ్యల్ని వారికి అనువుగా వ్యాఖ్యానిస్తుంటారు. ఈ “వెయ్యేండ్ల పాలన” అనే సిద్ధాంతంలో స్వవిరుద్ధమైన విషయాలు అసత్య బోధలు ఎన్నో ఉన్నాయి. ఈ “సహస్ర వార్షిక పాలన” (1000 year reign) లేఖనానుసారమైందా, కాదా? క్రీస్తు రాజ్యాన్ని గూర్చి లేఖనాలు ఏమి బోధిస్తున్నాయి? క్రీస్తు భూమి మీదికి భౌతికంగా మరల వస్తారా? అంతిమ తీర్పుకు ముందే క్రీస్తు భూమిపై లౌకిక పాలన చేస్తారా? క్రీస్తు రాజ్యాన్ని గూర్చి అయోమయానికి గురిచేస్తున్న ఇత్యాది ప్రశ్నలకు లేఖనాల నుండి జవాబులు నేర్చుకొందాం.

# రాజ్యాన్ని వెతకండి

క్రీస్తు ప్రభువు ఇట్లు చెప్పారు: "మీరు **రాజ్యాన్ని నీతిని** మొదట వెతకండి; అప్పుడు అవన్నీ మీకు అనుగ్రహించబడతాయి" (మత్తయి 6:33). ఈ వాక్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే, రెండు విషయాల్ని మనం గ్రహించగలం: మొదటిది— "రాజ్యాన్ని వెతకటం," రెండవది— "నీతిని వెతకటం." రాజ్యాన్ని వెతకాలంటే— దాన్ని గూర్చిన దేవుని సంకల్పాన్ని, ఉనికిని, మరియు స్వభావాన్ని తెల్సుకోవాలి.

## ఇశ్రాయేలీయుల రాజ్యపాలన వ్యవస్థ

దేవుని నడిపింపుతో ఇశ్రాయేలీయులు ఈజిప్టు నుండి కనాను దేశం చేరిన పిమ్మట వారిని ఇంచుమించు 400 ఏండ్లు న్యాయాధిపతులు పాలించారు. ప్రవక్తయైన సమూయేలు న్యాయాధిపతిగా ఉన్న కాలంలో— "సకల జనుల మర్యాద చొప్పున మాకు ఒక రాజును నియమించు, ఆయన మాకు న్యాయం తీరుస్తాడు" అని ఇశ్రాయేలీయులు అడిగారు. అప్పుడు, దేవుని అనుమతితో సమూయేలు వారి కోరికను మన్నించి, రాచరికం వలనైన కష్టనష్టాల్ని వారికి వివరించి (1 సమూ 8:5–22), సౌలును అభిషేకించి రాజుగా నియమించాడు. "సమూయేలుకు యెహోవా ఇట్లు చెప్పాడు— 'జనులు నీతో చెప్పిన మాటలు అన్నిటి ప్రకారం జరిగించు; **వారు నిన్ను విసర్జించ లేదు గాని వారిని ఏలకుండ నన్నే విసర్జించారు**'" (1 సమూ 8:7). నిజానికి, ఇశ్రాయేలీయులు ఒక రాజును కల్గి ఉండే

ఏర్పాటును దేవుడు తన శాసనంలో ముందుగానే నిర్ణయించాడు: "నీ దేవుడైన యెహోవా నీకు ఇస్తున్న దేశంలో నీవు ప్రవేశించి, దాన్ని స్వాధీనపర్చుకొని, అందులో నివసించి— 'నా చుట్టు ఉన్న సమస్త జనాల వలె నా మీద రాజును నియమించుకొంటాను' అని అనుకొంటే, నీ దేవుడైన యెహోవా ఏర్పరచే వానిని అవశ్యంగా నీ మీద రాజుగా నియమించుకోవలెను. నీ సోదరులలోనే ఒకణ్ణి నీ మీద రాజుగా నియమించుకోవలెను. నీ సోదరుడు కాని అన్యుని నీ మీద నియమించుకోకూడదు" (ద్వితీ 17:14,15). తదుపరి రాజుకు తగని నాలుగు నిషేధ ఆజ్ఞలు, నెరవేర్చవలసిన నాలుగు నిర్దేశక విధులు ఇవ్వబడ్డాయి (ద్వితీ 17: 16–22). దేవుని చిత్త ప్రకారం సమూయేలు ప్రవక్త బెన్యామీను గోత్రికుడైన సౌలును రాజుగా అభిషేకించి (1 సమూ 9:16; 10:22–24), రాజ్య పాలన పద్ధతిని ప్రజలకు విన్పించి, ఒక గ్రంథాన్ని వ్రాసి, దాన్ని యెహోవా సన్నిధిని ఉంచాడు (1 సమూ 10:25).

క్రీ.పూ 1095 వ సంవత్సరం నుండి ఇశ్రాయేలీయులకు రాజరిక వ్యవస్థ ఏర్పడింది. రాజైన సౌలు దేవునికి విరోధంగా పాపం చేయటం వలన రాజరికం యూదా గోత్రికుడైన దావీదుకు అనుగ్రహించబడింది (అపొ 13:21,22). ఇశ్రాయేలీయుల్ని సౌలు 40 సంవత్సరాలు, దావీదు 40 సంవత్సరాలు, సోలోమోను 40 సంవత్సరాలు పరిపాలించిన పిమ్మట— సొలోమోను కుమారుడైన రెహబాము పాలనలో ఇశ్రాయేలు దేశం క్రీ.పూ 930 వ సంవత్సరంలో రెండు భాగాలుగా విడిపోయింది.

అప్పుడు ఉత్తర ప్రాంతమైన **ఇశ్రాయేలు**కు షోమ్రోను రాజధానిగా యరోబాము రాజుగా రాజ్య పాలన ప్రారంభమై, 19 మంది రాజులచే పరిపాలింపబడి— ప్రజల యొక్క, రాజుల యొక్క పాపాల వలన హోషేయ ఏలుబడిలో క్రీ.పూ 721 వ సంవత్సరాన అష్షూరీయులచే చెరపట్టబడింది. ఇశ్రాయేలు రాజ్యపు నాశనాన్ని చూసి కూడ వారి వలెనే పాపం నుండి దేవుని వైపు మరల నందున, దక్షిణ ప్రాంతమైన **యూదా** రాజ్యం రెహబాము రాజుగా పాలన మొదలై 20 మంది రాజులచే ఏలబడి, రాజైన సిద్కియా కాలంలో క్రీ.పూ 606 నుండి 586 వరకు బబులోనీయులచే చెరపట్టబడింది.

ఇశ్రాయేలీయుల్ని దేవుడు ముందే ఇట్లు హెచ్చరించాడు: "మీరు పిల్లల్ని పిల్లల పిల్లల్ని కని ఆ దేశంలో బహు కాలం నివసించిన తర్వాత మిమ్మల్ని మీరు పాడుచేసికొని, ఏదైన స్వరూపం కల్గిన విగ్రహాన్ని చేసుకొని, నీ దేవుడైన యెహోవాకు కోపం పుట్టిస్తే ... మీరు ఈ యొర్దాను దాటి స్వాధీనం చేసుకోబోయే దేశంలో ఉండకుండ త్వరగా నశించిపోతారు. ఆ దేశంలో ఎక్కువ కాలం ఉండక మీరు నిర్మూలమైపోతారు. మరియు యెహోవా జనాల్లో మిమ్మల్ని చెదరగొడతాడు; యెహోవా ఎక్కడికి మిమ్మల్ని తోలివేస్తాడో అక్కడి జనాల్లో మీరు కొద్ది మందే మిగులుతారు" (ద్వితీ 4:25–27). ద్వితీయోపదేశకాండం 4,8 అధ్యాయాలు చదివితే దీన్ని గూర్చి విపులంగా తెల్సుకోవచ్చు.

# మెస్సీయ కొరకు ఇశ్రాయేలీయుల నిరీక్షణ

“ఇశ్రాయేలీయులు యరొబాము చేసిన పాపాల్లో దేన్నీ విడువక వాటిని అనుసరిస్తూ వచ్చారు. కనుక తన సేవకులైన ప్రవక్తల ద్వారా యెహోవా సెలవిచ్చిన మాట ప్రకారం, ఆయన ఇశ్రాయేలీయుల్ని తన సముఖం నుండి వెళ్లగొట్టాడు. ఆ హేతువు చేత వారు తమ స్వదేశంలో నుండి అష్షూరు దేశానికి  ఖైదీయులుగా కొనిపోబడ్డారు; నేటి వరకు వారు అక్కడ ఉన్నారు. అష్షూరు రాజు బబులోను, కూతా, అవ్వా, హమాతు, సెపర్వయీము అను తన దేశాల్లో నుండి జనుల్ని రప్పించి, ఇశ్రాయేలీయులకు బదులుగా షోమ్రోను పట్టణంలో నివాసం ఉంచాడు. కనుక వారు షోమ్రోనును ఆక్రమించుకొని దాని పట్టణాల్లో కాపురం చేసారు. అయితే వారు నివసింప నారంభించగా యెహోవా యందు భయభక్తులు లేనివారు గనుక యెహోవా వారి మధ్యకు సింహాల్ని పంపాడు. అవి వారిలో కొందర్ని చంపాయి. ‘తమరు ఆక్రమించిన షోమ్రోను పట్టణంలో తమరు ఉంచిన ప్రజలకు ఆ దేశపు దేవుని కట్టడలు తెలియవు. ఇశ్రాయేలు దేవుని మర్యాద వారికి తెలియదు. కనుక ఆయన వారి మధ్యకు సింహాల్ని పంపాడు. సింహాలు వారిని చంపుతున్నాయి’ అని వారు అష్షూరు రాజుతో మనవిచేసారు. అష్షూరు రాజు—— ‘అక్కడ నుండి బందీలుగా తేబడిన యాజకుల్లో ఒకణ్ణి అక్కడికి మీరు తోడుకొనిపొండి; అతడు అక్కడికి వెళ్ళి కాపురం ఉండి ఆ దేశపు దేవుని మర్యాదను వారికి నేర్పాలి’ అని ఆజ్ఞాపించాడు. కాగా షోమ్రోనులో నుండి వారు పట్టుకొని వచ్చిన యాజకుల్లో ఒకడు వచ్చి బేతేలు ఊరిలో కాపురం ఉండి, యెహోవా యందు భయభక్తులు కల్గి జీవించ తగిన

మర్యాదను వారికి బోధించాడు" (2 రాజులు 17:22–28). ఇశ్రాయేలీయుల మరియు అష్షూరీయుల మిశ్రమ సంతానమే సమరయులు.

క్రీస్తుతో సంభాషించిన సమరయ స్త్రీ ఆయనతో ఇట్లంది: "క్రీస్తు అనబడే మెస్సీయ వస్తారు అని నాకు తెలుసు. ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తం తెలియజేస్తాడు" (యోహాను 4:25). దీన్ని బట్టి సమరయులు మెస్సీయ కొరకు నిరీక్షించినట్లు స్పష్టమౌతోంది.

## మెస్సీయ కొరకు యూదుల నిరీక్షణ

నెబుకద్నెజరుచే బబులోను చెరకు బందీలుగా యూదులు కొనిపోబడక ముందు వారి గతిని గూర్చి ఇర్మియా ఇట్లు ప్రవచించాడు: "యెహోవా ఈ ఆజ్ఞ ఇస్తున్నాడు— బబులోను రాజ్యానికి డెబ్బది సంవత్సరాలు గతించిన తరువాతనే మిమ్మల్ని గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి ఈ స్థలానికి మిమ్మల్ని తిరిగి రప్పించునట్లు నేను మిమ్ముల్ని దర్శిస్తాను" (ఇర్మియా 29:10). ఈ ప్రవచన ప్రకారం యూదులు బబులోనులో 70 సంవత్సరాలు బానిసత్వంలో జీవించారు (దానియేలు 9:2; 2 దిన 36:23). ఇర్మియా ప్రవచనం నెరవేరునట్లు పారశీక రాజైన కోరెషు మనస్సును దేవుడు ప్రేరేపించగా, యెరూషలేములో దేవుని మందిరాన్ని నిర్మించటానికి అనుమతించాడు (ఎజ్రా 1).

జెరుబ్బాబెలు నాయకత్వాన క్రీ.పూ 536 సంవత్సరంలో యూదులు బయల్దేరి యెరూషలేం వెళ్ళి దేవాలయాన్ని 20 సంవత్సరాల కాలంలో

పునఃనిర్మించారు (ఎజ్రా 3–6). క్రీ.పూ 457వ సంవత్సరంలో ఎజ్రా నాయకత్వాన మరి కొందరు యూదులు యెరూషలేం చేరుకొన్నారు. శాస్త్రియైన ఎజ్రా ధర్మశాస్త్రాన్ని పరిశోధించి దేవాలయంలో జరుపవలసిన ధర్మాల్ని విధుల్ని ఆరాధన వ్యవస్థను పునరుద్ధరించాడు (ఎజ్రా 7–10). పిమ్మట క్రీ.పూ 444 వ సంవత్సరంలో నెహెమ్యా బబులోను నుండి యెరూషలేం వెళ్ళి ప్రాకారాల్ని మరలా నిర్మించాడు. అప్పటి నుండి యూదులు తమ దేవుణ్ణి ఆరాధించుకోటానికి యెరూషలేములో ఒక దేవాలయాన్ని కల్గి ఉండిరి.

"యెరూషలేములో సుమెయోను అనే ఒక మనుష్యుడు ఉండేవాడు. అతడు నీతిమంతుడును భక్తిపరుడునై ఉండి, ఇశ్రాయేలు యొక్క **ఆదరణ** కొరకు **నిరీక్షించే** వాడు" (లూకా 2:25). అన్న అను ఒక ప్రవక్తి "ఆ గడియలోనే లోనికి వచ్చి దేవుని కొనియాడి, యెరూషలేంలో **విమోచన** కొరకు **కనిపెట్టు**చున్నవారందరితో ఆయన్ని గూర్చి మాట్లాడింది" (లూకా 2:38). అంద్రెయ "మొదట తన సోదరుడైన సీమోనును చూసి– 'మేం **మెస్సీయను కనుగొన్నాం**' అని అతనితో చెప్పి, ఏసు దగ్గరకు అతణ్ణి తోడ్కొనివచ్చాడు. 'మెస్సీయ అను మాటకు అభిషిక్తుడు' అని అర్థం" (యోహాను 1:41). "ప్రజలు కనిపెట్టుచు, 'ఈయనే క్రీస్తు కావచ్చు' అని అందరు యోహానును గూర్చి తమ హృదయాల్లో **ఆలోచించు**కొన్నారు" (లూకా 3:15). మార్త ఇట్లంది: "ప్రభువా, నీవు లోకానికి **రావలసిన** దేవుని కుమారుడవైన క్రీస్తు అని నమ్ముతున్నాను" (యోహాను 11:27). ఈ లేఖన

భాగాల ప్రకారం యూదులు కూడ మెస్సీయ కొరకు నిరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇంత వరకు గమనించిన యూదుల చరిత్ర నుండి మనం నేర్చుకోవల్సిన విషయాలు ఏమంటే:

1. సౌలు రాజుచే క్రీ.పూ 1095 నుండి ఆరంభమైన రాజరిక పాలన క్రీ.పూ 586 లో ముగిసింది.

2. క్రీ.పూ 586 నుండి యూదా రాజ్య సింహాసనంపై రాజు లేడు.

3. యూదులు బబులోను నుండి యెరూషలేం తిరిగి వెళ్ళి దేవాలయాన్ని పునఃనిర్మించుకొన్న తర్వాత ఆధ్యాత్మికమైన పునరుద్ధరణ జరిగింది. కాని రాజరిక వ్యవస్థ మరల ఏర్పడలేదు. అంటే, యూదా రాజరిక పాలన గాని, ఇశ్రాయేలు రాజరిక పాలన గాని ఎన్నడు పునరుద్ధరింపబడ లేదు.

4. ప్రపంచంలో నేడు యూదులు అనే వారున్నా, వారు ఏయే గోత్రాలకు చెందిన వారో వారెరుగరు.

5. గనుక యూదులకు రాజరిక వ్యవస్థ స్థాపింపబడి యూదా గోత్రికుడు భౌతికంగా రాజై ఏలుట ఎన్నటికీ అసంభవం.

## దావీదు సంతానం – క్రీస్తు

రాజ్యం మరియు రాజును గూర్చి ప్రవక్తల ద్వారా ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన వాగ్దానాలు వాటి నేరవేర్పుల్ని తెల్సికొందాం:

1. **దావీదుకు దేవుడు చేసిన వాగ్దానం—** "నీ మట్టుకు నీ సంతానం నీ రాజ్యం నిత్యం స్థిరమౌతుంది, నీ సింహాసనం నిత్యం స్థిరపరచబడుతుంది" (2 సమూ 7:16).

**నెరవేర్పు—** పేతురు ఈ ప్రవచనాన్ని క్రీస్తుకు అన్వయించాడు: దావీదు "సమాధి నేటి వరకు మన మధ్య ఉంది. అతడు ప్రవక్తయై ఉండెను. గనుక అతని గర్భఫలంలో నుండి అతని సింహాసనం మీద ఒకని కూర్చోబెడతాను అని దేవుడు తనతో ప్రమాణపూర్వకంగా ఒట్టుపెట్టుకొన్న సంగతి అతనికి తెలుసు. క్రీస్తు పాతాళంలో విడువబడలేదని, ఆయన శరీరం కుళ్లిపోలేదని దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానాన్ని గూర్చి చెప్పాడు. ఈ ఏసును దేవుడు లేపాడు; దీనికి మేమందరం సాక్షులం ... మీరు సిలువవేసిన ఈ ఏసునే దేవుడు **ప్రభువుగా క్రీస్తుగా నియమించారు**. ఇది ఇశ్రాయేలు వంశం అంతా రూఢిగా తెలిసికోవాలని చెప్పాడు" (అపొ 2:30–36). అంటే, ఈ ఏసునే దేవుడు **ప్రభువు**గా, **రాజు**గా అభిషేకించారు; పట్టాభిషేకం జరిగిపోయింది!

2. **ప్రవచనం—** "ఎందుకంటే, మనకు శిశువు పుట్టాడు. మనకు కుమారుడు అనుగ్రహింపబడ్డాడు. ఆయన భుజం మీద **రాజ్యభారం** ఉంటుంది. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడైన తండ్రి సమాధానకర్త యగు అధిపతి అని ఆయనకు పేరు పెడతారు. ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధి క్షేమం కలిగేలా సర్వకాలం దావీదు సింహాసనాన్ని **రాజ్యాన్ని నియమిస్తాడు**. న్యాయం వలన **నీతి** వలన **రాజ్యం**

స్థిరపరచటానికి ఆయన సింహాసనాసీనుడై **రాజ్య పరిపాలన** చేస్తాడు" (ఎషయా 9:6,7).

**నెరవేర్పు—** "ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కంటావు. ఆయనకు ఏసు అను పేరు పెట్టు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడతాడు; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు **సింహాసనాన్ని** ఆయనకు ఇస్తారు ... ఆయన **రాజ్యానికి** అంతం ఉండదు" (లూకా 1:31–33).

3. **ప్రవచనం—** "నేను దావీదు ఇంటి తాళపు అధికార భారాన్ని ఆయన భుజం ఉంచుతాను. ఆయన తీయగా ఎవడు మూయజాలడు. ఆయన మూయగా ఎవడు తీయజాలడు" (ఎషయా 22:22).

**నెరవేర్పు—** "దావీదు తాళపుచెవి కలిగి, ఎవడు వేయలేకుండ తీసేవాడుగా, ఎవడు తీయలేకుండ వేసే వాడైన సత్యస్వరూపియైన పరిశుద్ధుడు" (ప్రకటన 3:7). ఈయన క్రీస్తే అని మనకు స్పష్టమే. తాళపుచెవి అధికారానికి చిహ్నం.

4. **ప్రవచనం—** "యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇస్తున్నాడు— రాబోవు దినములలో నేను దావీదుకు **నీతి చిగురు** పుట్టిస్తాను; ఆయన **రాజై పరిపాలన** చేస్తాడు. ఆయన వివేకంగా నడుచుకొంటూ కార్యం జరిగిస్తాడు. భూమి మీద నీతి న్యాయాలు జరిగిస్తాడు" (ఇర్మియా 23:5, 33:15; జెకర్యా 4:3, 6:12,13; హగ్గయి 2:9; హెబ్రీ 5:10, 7:1–3). "ఎష్షయి మొద్దు నుండి **చిగురు** పుడుతుంది. అతని వేరుల నుండి అంకురం ఎదిగి ఫలిస్తుంది" (ఎషయా 11:1). ఈయన క్రీస్తు.

**నెరవేర్పు**— "ఎష్షయిలో నుండి **వేరు చిగురు**, అంటే అన్యజనుల్ని **పరిపాలించ**టానికి వస్తారు; ఆయనలో అన్యజనులు నిరీక్షణ ఉంచుతారు" (రోమీ 15:12). పై ప్రవచనాల నేరవేర్పును బట్టి దావీదు సంతతి నుండి వచ్చిన క్రీస్తే రాజు అని స్పష్టమౌతోంది. "క్రీస్తు తన రాజ్యాన్ని స్థాపించలేక సంఘాన్ని స్థాపించాడు" అని కొందరు బోధించటం దేవుని సంకల్పాన్ని ఆయన సర్వ శక్తిని తృణీకరించడమే ఔతుంది. దేవునికి అసాధ్యమైంది ఏదీ లేదు.

పిలాతు— '"**ఇదిగో మీ రాజు**' అని యూదులతో అన్నాడు. అందుకు వారు— 'ఇతన్ని తీసుకొనిపొండి, తీసుకొనిపొండి, సిలువవేయండి' అని కేకలు వేసారు. పిలాతు— 'మీ రాజును సిలువవేయాలా?' అని వారిని అడిగాడు. ప్రధానయాజకులు— '**కైసరు తప్ప మాకు వేరొక రాజు లేదు**' అన్నారు. అతడు అప్పుడు సిలువవేయటానికి ఆయన్ని వారికి అప్పగించాడు. వారు ఏసును పట్టుకొనివెళ్ళారు. ఆయన తన సిలువను మోసికొని **కపాలస్థలం** అనే చోటికి వెళ్ళారు. హెబ్రీ భాషలో దానికి **గొల్గొతా** అని పేరు. అక్కడ వారు ఏసును మధ్యలో ఉంచి ఆయనతో కూడ ఇద్దర్ని ఇరు ప్రక్కలా సిలువవేసారు. మరియు పిలాతు— '**యూదుల రాజగు నజరేయుడైన ఏసు**' అను పైవిలాసం వ్రాయించి సిలువ పైన పెట్టించాడు. ఏసు సిలువవేయబడిన స్థలం పట్టణానికి సమీపంగా ఉంది. అది హెబ్రీ, గ్రీకు, రోమా భాషల్లో వ్రాయబడింది. గనుక యూదుల్లో అనేకులు దాన్ని చదివారు. 'నేను యూదుల రాజును అని వాడు అన్నట్లు వ్రాయండి' అన్నారు. గాని— '**యూదుల రాజు** అని వ్రాయ వద్దు' అని యూదుల ప్రధాన యాజకులు

పిలాతుతో చెప్పగా, పిలాతు— 'నేను వ్రాసింది ఏదో వ్రాసాను' అన్నాడు" (యోహాను 19:14-22; లూకా 23:2). పౌలు థెస్సలొనీకలో సువార్త ప్రకటిస్తుండగా అక్కడి యూదులు ఇట్లన్నారు: "భూలోకాన్ని తలక్రిందులు చేసిన వీరు ఇక్కడికి కూడ వచ్చారు. యాసోను వీరిని చేర్చుకొన్నాడు. వీళ్ళందరు '**ఏసు అనే వేరొక రాజు ఉన్నాడు**' అని చెప్పి, 'కైసరు చట్టాలకు విరోధంగా నడుచుకొనేవారు' అని కేకలు వేసారు" (అపొ 17:6,7). లేఖనాలు ఎరుగని అన్యుడైన పిలాతు కొన్ని నిమిషాలు క్రీస్తును ప్రశ్నించి, ఆయన "యూదుల రాజగు నజరేయుడైన ఏసు" అని గుర్తించాడు, ధృవపర్చాడు. కాని లేఖనాల్లో పండితులైన యూదులు కాదన్నారు. బైబిలు పండితులం అనుకొనే అనేకులు నేడు కూడ క్రీస్తు రాజై ఉన్నారు అని విశ్వసించటం లేదు.

క్రీస్తు రాజై ఉన్నట్లయితే— ఆయన రాజ్యమేది? అది ఎప్పుడు స్థాపించబడింది? ఎక్కడ స్థాపించబడింది? దాని స్వాభావికత ఎట్లు ఉంటుంది?

## క్రీస్తు రాజ్యాన్ని గూర్చిన అపోహలు

ఈనాటి అనేకుల వలెనే క్రీస్తు ఈ లోకంలో బోధిస్తున్న కాలంలో కూడ రాజ్యం ఎలాంటిదో ఎట్టి స్వభావాన్ని కల్గి ఉంటుందో గ్రహించక, క్రీస్తు ఒక లౌకిక రాజ్యాన్ని స్థాపిస్తారు అని వారు తలంచారు. కాని "దేవుని రాజ్యం **ప్రత్యక్షం**గా రాదు" అని క్రీస్తు బోధించారు (లూకా 17:20).

1. జెబెదయ కుమారుల తల్లి క్రీస్తును ఇట్లు వేడుకొంది: “తమరి **రాజ్యం**లో ఈ నా ఇద్దరు కుమారుల్లో ఒకడు తమరి కుడి వైపున ఒకడు తమరి ఎడమ వైపున కూర్చోటానికి అనుమతి ఇవ్వండి” (మత్తయి 20:21). కాని క్రీస్తు రాజ్య పాలనలో అందరు సమానమే. సోపానక్రమం (hierarchy), క్రమానుగత శ్రేణి, పదవుల పరంపర (succession), విభిన్న స్థాయిలతో కూడిన వ్యవస్థ లేదు.

2. క్రీస్తుతో సిలువ వేయబడినవారిలో ఒకడు— “ఏసూ, తమరు తమ **రాజ్యం** లోనికి వచ్చినప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకోండి” అన్నాడు (లూకా 23:42).

3. క్రీస్తు పునరుత్థానుడైన పిమ్మట ఆయన శిష్యులు కలసి వచ్చి— “ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలుకు **రాజ్యం** మరల అనుగ్రహిస్తారా?” అని అడిగారు (అపొ 1:6). ఇశ్రాయేలీయులకు భౌతిక రాజ్యం తిరిగి స్థాపింపబడుతుంది అని వారు అనుకొన్నారు.

## క్రీస్తు రాజ్యం ఆత్మ సంబంధమైంది

“ఏసు— ‘నా రాజ్యం ఈ లోకానికి సంబంధించింది కాదు. నా రాజ్యం ఈ లోకానికి సంబంధించింది అయితే, నేను యూదులకు అప్పగింపబడకుండా నా సేవకులు పోరాడతారు. కాని నా రాజ్యం ఇహ సంబంధమైంది కాదు’ అని జవాబిచ్చారు” (యోహాను 18:36). క్రీస్తు రాజ్యం ఆత్మీయమైంది. ఈ రోజు కూడ— “ఏసే మెస్సీయ” అని 99% యూదులు నమ్మరు.

“అందుకు పిలాతు— ‘నీవు **రాజు**వా’ అని ఆయన్ని ప్రశ్నించగా, ఏసు— ‘తమరు అన్నట్లు **నేను రాజు**నే’ అన్నారు” (యోహాను 18:37). “ప్రభువు పేరున వస్తున్న **రాజు** స్తుతింపబడును గాక!” (లూకా 19:38). “ఇదిగో, నీ **రాజు** సాత్వికుడై వస్తున్నారు” (మత్తయి 21:5) అనే లేఖనాలు నెరవేరునట్లు జన సమూహాలు మహా శబ్దంతో స్తోత్రించారు. క్రీస్తు రాజ్యం లోక సంబంధమైంది కానట్లే, క్రీస్తు లౌకికమైన రాజు కారు. కనుకనే ఒకసారి ప్రజలు ఆయన్ని— “**రాజు**గా చేయటానికి వారు వచ్చి తనని బలవంతంగా పట్టుకోబోతున్నారు అని ఎరిగి ఆయన మరల కొండకు ఒంటరిగా వెళ్ళారు” (యోహాను 6:15). క్రీస్తు లౌకిక రాజై పాలించాలని సంకల్పించలేదు.

“ఏసు తన రాజ్యాన్ని స్థాపించటానికి పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నందున సంఘాన్ని స్థాపించారు” అనే వాదన, పై వాక్యాల్ని బట్టి అసత్యం. క్రీస్తుకు అపవాది భూ రాజ్యాలు అన్నింటిని ఆయనకు చూపించి— “నీవు సాగిలపడి నాకు నమస్కరిస్తే, వీటన్నింటిని నీకు ఇస్తాను” అని చెప్పగా, ఏసు— “సాతానా, పో” అని అనలేదా? (లూకా 4:5; మత్తయి 4:9,10). లౌకిక రాజ్య స్థాపనకు క్రీస్తు సమ్మతించ లేదు. ఎందుకంటే, క్రీస్తు రాజ్యం ఆత్మ సంబంధమైంది.

దీన్ని గూర్చి ఎషయా 2:2–4 లో స్పష్టంగా ప్రవచింపబడింది— “అంత్య దినాల్లో పర్వతాల పైన యెహోవా మందిర పర్వతం పర్వత శిఖరాన స్థిరపర్చబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడుతుంది. ప్రవాహం వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోకి వస్తారు. ఆ కాలంలో సీయోనులో నుండి

ధర్మశాస్త్రం **యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలు వెళ్తుంది**. జనులు గుంపులు గుంపులుగా వచ్చి— 'యాకోబు దేవుని మందిరానికి యెహోవా పర్వతానికి మనం వెళ్దాం రండి; ఆయన తన మార్గాల విషయమై మనకు బోధిస్తారు. మనం ఆయన త్రోవల్లో నడుద్దాం' అని చెప్పుకొంటారు. ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయం తీరుస్తారు; అనేక జనాలకు తీర్పుతీరుస్తారు. వారు తమ ఖడ్గాల్ని నాగటి నక్కులుగాను తమ ఈటెల్ని మచ్చుకత్తులుగా సాగగొడతారు; జనం మీదికి జనం ఖడ్గమెత్తరు; యుద్ధంచేయ నేర్చుకోవటం ఇక మానివేస్తారు." పై ప్రవచనం లోని నాల్గవ వచనాన్ని గమనిస్తే, భౌతిక యుద్ధాలకు స్వస్తి పల్కుటకై యుద్ధాయుధాల్ని పనిముట్లుగా మారుస్తారని ప్రవచింపబడింది. దీన్ని బట్టి క్రీస్తు యొక్క రాజ్య స్వభావం అధ్యాత్మికమైంది అని స్పష్టమౌతోంది.

## ప్రవచనాల్లో రాజ్యం

"రాజా, తమరు చూస్తుండగా ఒక **విరాట ప్రతిమ** కనబడింది గదా. ఈ గొప్ప ప్రతిమ మహా ప్రకాశమైన, భయంకరమైన రూపంగలదై తమరి ఎదుట నిలిచింది. ఆ ప్రతిమ యొక్క శిరస్సు మేలిమి బంగారుమయమైనది, దాని రొమ్ము భుజాలు వెండివి, దాని ఉదరం తొడలు ఇత్తడివి, దాని మోకాళ్లు ఇనుపవి, దాని పాదములలో ఒక భాగం ఇనుపది, ఒక భాగము మట్టిదై ఉండెను. మరియు చేతి సహాయం లేక తీయబడ్డ ఒక రాయి, ఇనుము మట్టి కలిసిన ఆ ప్రతిమ యొక్క పాదాల మీద పడి దాని పాదాల్ని తుత్తునియలుగా విరుగగొట్టినట్లు తమరికి కన్పించింది. అంతట ఇనుం మట్టి

ఇత్తడి వెండి బంగారం ఏకముగా దంచబడి కళ్ళంలోని చెత్తలా కాగా వాటికి స్థలం ఎచ్చటను దొరక్కుండ గాలికి కొట్టుకొనిపోయింది; ప్రతిమను విరగ్గొట్టిన ఆ రాయి సర్వ భూతలం అంత మహా పర్వతమైంది" (దానియేలు 2:31–35). చేతి సహాయం లేకుండా తీయబడ్డ "రాయి" క్రీస్తు రాజ్యం.

"ఆ రాజుల కాలంలో పరలోకంలో ఉన్న దేవుడు ఎన్నటికిని నశించని ఒక **రాజ్యం** స్థాపిస్తాడు. ఆ **రాజ్యం** దాన్ని **పొందినవారి**కి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యాలన్నింటిని పగులగొట్టి నిర్మూలం చేస్తుంది గాని అది యుగాల వరకు నిలిచి ఉంటుంది" (దానియేలు 2:44). నెబుకద్నెజరు రాజుకు స్వప్నంలో కన్పించిన ఒక "విరాట విగ్రహం" (huge statue) యొక్క భావాన్ని వివరిస్తూ, ప్రవక్త దానియేలు రాజ్యాన్ని గూర్చి ప్రవచించిన వాక్కు ఇది.

ఆ **విరాట విగ్రహానికి** చరిత్ర నుండి అన్వయించే భావం క్రింద ఇవ్వబడింది:

## దానియేలు రెండవ అధ్యాయంలోని – నాలుగు సామ్రాజ్యాలు

1. శిరస్సు – బంగారం బబులోను సామ్రాజ్యం క్రీ.పూ 606–537

2. భుజాలు, రొమ్ము – వెండి: మాదీ – పారశీక సామ్రాజ్యాలు క్రీ.పూ 536–331

3. ఉదరం, తొడలు – ఇత్తడి గ్రీకు సామ్రాజ్యం క్రీ.పూ 330–146

4. మోకాళ్ళు, పాదాలు ఇనుము + మట్టి . రోమా సామ్రాజ్యం క్రీ.పూ 146–క్రీ.శ 476



"తమరే ఆ బంగారపు శిరస్సు" (38 వచనం)

"తమరి రాజ్యం కంటే తక్కువైన రాజ్యం ఒకటి లేస్తుంది" (39 వచనం)

"లోకం అంతా ఏలునట్టి మూడవ రాజ్యం ఒకటి లేస్తుంది" (39 వచనం)

"నాల్గవ రాజ్యం ఇనుం వలె బలంగా ఉంటుంది" (40 వచనం) "ఆ రాజ్యంలో బేధాలు ఉంటాయి"

చేతి సహాయం లేకుండా తీయబడ్డ "రాయి" దేవుని రాజ్యం (దానియేలు 2:34). ఆ రాజుల కాలంలో అంటే, నాల్గవ రాజుల కాలంలో— "రోమీయుల సామ్రాజ్య పాలన" అంతంకాక ముందే "దేవుని రాజ్యం" స్థాపింపబడాలి. ఇదియే ఆధ్యాత్మిక రాజ్యం, క్రీస్తు రాజ్యం, క్రీస్తు సంఘం!

దానియేలు ప్రవక్త నెబుకద్నెజరుకు వివరించిన భావాన్ని బట్టి పరలోక రాజ్యం లేక దేవుని రాజ్యం రోమీయుల పరిపాలనా కాలంలోనే స్థాపింపబడాలని ప్రవచింపబడింది. రోమీయుల పాలనలోనే క్రీస్తు సశరీరుడై జీవించారు.

## రాజ్యాన్ని గూర్చి క్రీస్తు బోధలు

దేవుని ఆజ్ఞలు "గైకొని బోధించువాడే పరలోకరాజ్యంలో గొప్పవాడు అనబడతాడు. శాస్త్రుల **నీతి** కంటే పరిసయ్యుల **నీతి** కంటే మీ **నీతి** అధికం కాకపోతే మీరు పరలోకరాజ్యంలో ప్రవేశింపలేరు" (మత్తయి 5:20) అని క్రీస్తు బోధించారు. పరిసయ్యులు చాలా ఎక్కువ సేపు మాట్లాడేవారు కాని ఆచరణలో ఇంచుమించు శూన్యం; బాహ్యంగా నీతిమంతులుగా కనిపించడమే వారికి ఇష్టం!

1. "పరలోక రాజ్యం **సమీపించి** ఉంది, మారుమనస్సు పొందండి" అని నిమజ్జనం (immersion) ఇచ్చిన యోహాను ప్రకటించాడు (మత్తయి 3:2). "పరలోక రాజ్యం" అనే పదబంధం (phrase) మత్తయి సువార్తలో 32 సార్లు ఉంది.

2. “దేవుని రాజ్యం **సమీపించి** ఉంది, మారుమనస్సు పొందండి” (మార్కు 1:15). “పరలోక రాజ్యం **సమీపించి** ఉంది, మారుమనస్సు పొందండి” (మత్తయి 4:7). “నిశ్చయంగా దేవుని రాజ్యం **మీ వద్దకు వచ్చి** ఉంది” (మత్తయి 12:28). “ఇదిగో దేవుని రాజ్యం మీ **మధ్యలోనే** ఉంది” (లూకా 17:20,21). “నిశ్చయంగా **దేవుని రాజ్యం** మీ **దగ్గరకు వచ్చి** ఉంది” (లూకా 11:20).

3. “నా కాలం సమీపమై ఉంది” (మత్తయి 26:18). “**కాలం పరిపూర్ణమై** ఉంది” (మార్కు 1:15). “**కాలం వస్తోంది**, అది ఇప్పుడు **వచ్చే ఉంది**” (యోహాను 4:23).

4. పరలోక రాజ్యాన్ని గూర్చి ఉపమాన రీతిలో క్రీస్తు విస్తారంగా బోధించారు——

గోధుమలు – గురుగులు (మత్తయి 13:24–30), ఆవగింజ (మత్తయి 13:31,32), పులిసిన పిండి (మత్తయి 13:33), పొలంలోని ధనం (మత్తయి 13:44), ముత్యం (మత్తయి 13:45,46), చిన్న పిల్లలు (మత్తయి 19:14), పెండ్లి విందు (మత్తయి 22:1–13).

5. క్రీస్తు పునరుత్థానుడైన పిమ్మట, నలబై రోజుల వరకు శిష్యులకు కన్పిస్తూ – “**దేవుని రాజ్య** విషయాల్ని గూర్చి బోధించారు” (అపొ 1:3).

దేవుడు “తన వాక్కును పంపించి వారిని స్వస్థపరిచాడు; ఆయన వారిని సమాధి నుండి రక్షించాడు” (కీర్తన 107:20). “మన ప్రభువైన ఏసు క్రీస్తు మూలంగా మనకు జయం అనుగ్రహిస్తున్న దేవునికి స్తోత్రం కల్గును గాక” (1 కొరింథీ 15:57).

# రాజ్య స్థాపనకు అనుకూల సమయం

"అందుకు సీమోను పేతురు— 'నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తు' అని చెప్పాడు. అందుకు ఏసు— 'సీమోను బర్యోన, నీవు ధన్యుడవు, పరలోకమంలో ఉన్న నా తండ్రియే ఈ సంగతిని నీకు బయల్పర్చెనే కాని నరులు నీకు బయల్పర్చ లేదు. నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘాన్ని నిర్మిస్తాను, పాతాళలోక ద్వారాలు దాన్ని ఎదిరించి నిలువలేవు' అని నేను నీతో చెబుతున్నాను" (మత్తయి 16:16–18). "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తు" అనే వాస్తవంపై, పటిష్టమైన బండపై సంఘం నిర్మించబడాలి.

"క్రీస్తు దేవుని కుమారుడు" అని ఎప్పుడు రుజువు చేయబడింది? "మరణం ఆయన్ని బంధించి ఉంచుట అసాధ్యం. గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయన్ని లేపాడు" (అపొ 2:24). "ఏసుక్రీస్తు, శరీర ప్రకారం దావీదు సంతానంగా, మృతుల్లో నుండి పునరుత్థానుడు ఐనందున పరిశుద్ధ ఆత్మ ప్రకారం దేవుని కుమారుడుగా ప్రభావంతో నిరూపింపబడ్డాడు" (రోమీ 1:4). పాతాళలోక ద్వారాలు ఆయన పునరుత్థానుడు కాకుండా నిరోధించ లేకపోయాయి. మరొక మాటలో, సంఘం స్థాపింపబడక ముందే క్రీస్తు మృత్యుంజయుడు అవ్వాలి అని అర్థం. "పునరుత్థానం"— అంటే ప్రాముఖ్యత కోల్పోయిన స్థితి నుండి మరల బలమైన శక్తిగా ఆవిర్భవించుట. దీన్ని హెబ్రీలో "తెకూమా," గ్రీకులో "అనస్తాటిస్" అంటారు; వీటికి నిలబడటం, పైకి లేపడం, పైకి లేవడం అనే

అర్థాలు ఉన్నాయి. మృతుల నుండి “పునరుత్థానం” పొందటం వల్ల క్రీస్తు అపవాదిని జయించాడు. క్రీస్తు తన సమాధిని ఖాళీ చేసి సింహాసనాన్ని అధిరోహించాడు!

ఆత్మ ప్రేరితుడైన పేతురు ఇశ్రాయేలీయులతో ఇట్లన్నాడు: “మీరు సిలువవేసిన ఈ ఏసునే దేవుడు **ప్రభువుగా** [రాజుగా] క్రీస్తుగా నియమించాడు” (అపొ 2:36). “పరలోకంలోను భూమి మీద నాకు **సర్వాధికారం** ఇవ్వబడింది” (మత్తయి 28:18) అని పునరుత్థానుడైన ఏసు ఉద్ఘాటించారు. క్రీస్తుకు సర్వాధికారం ఇవ్వబడితే ఆయన తన రాజ్యాన్ని స్థాపించదానికి ఆటంకమే లేదు కదా!

క్రీస్తు తన ఆధ్యాత్మిక రాజ్యాన్ని స్థాపించటానికి అదే “పరిపూర్ణ సమయం” (గలతీ 4:4; అపొ 2:31), సరియైన తరుణం, అనుకూల సమయం.

## రాజ్యం శక్తితో స్థాపించబడింది

క్రీస్తు ఇట్లు అన్నారు: “ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు **దేవుని రాజ్యం** బలంతో రావడం చూసే వరకు మరణం రుచిచూడరు అని నిశ్చయంగా మీతో చెబుతున్నాను” (మార్కు 9:1; లూకా 9:27; మత్తయి 16:28). ఈ వాక్కు ప్రకారం— క్రీస్తు యొక్క బోధలు వ్యక్తిగతంగా విన్నవారిలో కొందరు జీవించి ఉండగానే రాజ్యం స్థాపించబడింది. రాజ్యం స్థాపించబడకపోతే, క్రీస్తు బోధలు స్వయంగా ముఖాముఖిగా విన్నవారిలో

కొందరు ఇంకా బ్రతికి ఉండాలి; వారి వయస్సు సుమారు 2,000 ఏండ్లు ఉండాలి. ఇంత వయస్సున్న వారు ఎవరైనా నేడు లోకంలో బ్రతికి ఉన్నారా?

ఈ లేఖన ప్రకారం దేవుని రాజ్యం శక్తితో వచ్చి ఉండాలి. క్రీస్తు తన శిష్యులకు ఇట్లు ఆజ్ఞాపించారు: “నా తండ్రి వాగ్దానం చేసింది మీకు పంపుచున్నాను. మీరు [అపొస్తలులు] పై నుండి శక్తి పొందే వరకు యెరూషలేం విడిచి వెళ్లక నా ద్వారా విన్న తండ్రి యొక్క వాగ్దానం కొరకు కనిపెట్టండి; ... మీరు పరిశుద్ధాత్మలో నిమజ్జనం (immersion) పొందుతారు” (అపొ 1:4,5). తండ్రి వాగ్దానం పరిశుద్ధాత్మ; పరిశుద్ధాత్మ వస్తే అపొస్తలులు శక్తి పొందుతారు; అంటే, రాజ్యం శక్తితో వస్తుంది అని భావం. “ఈ ఏసును దేవుడు లేపాడు; దీనికి మేము అందరం సాక్షులం. కాగా ఆయన్ని దేవుని కుడి పార్శ్వానికి హెచ్చించడం జరిగింది. పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానం తండ్రి వలన పొంది, మీరు చూస్తున్న వినుచున్న దీన్ని కుమ్మరించాడు” (అపొ 2:32,33). అంటే, 12 మంది అపొస్తలులు పెన్తెకొస్తు దినాన పరిశుద్ధాత్మ శక్తి పొందగానే క్రీస్తు రాజ్యం ఆవిర్భావించబడింది. ఈ ఆధ్యాత్మిక రాజ్యమే క్రీస్తు సంఘం!

“ఇదిగో, నీ **రాజు** నీతిమంతుడు రక్షణ కల్గినవాడు దీనుడునై, గాడిదను గాడిదపిల్లను ఎక్కి నీ దగ్గరకు వస్తున్నాడు” (జెకర్యా 9:9; మత్తయి 21:5). ఏసు అనేక సార్లు యెరూషలేంకు వెళ్ళినా, ఈసారి యెరూషలేంలోకి ఆయన తుది ప్రవేశానికి ఒక ప్రత్యేకత ఉంది. యూదులు తమ రాజు వైభవోపేతంగా, దర్పంతో, రాజసప్వంతో, ఆర్భాటంగా “యుద్ధసన్నద్ధుడైన రాజు” (war-waging king) వలె అశ్వంపై స్వారీచేస్తూ వస్తాడని

భావించారు; కాని ఆయన వినయంగా, సౌమ్యంగా, దీనంగా, "సమాధాన రాజు" (Prince of Peace) వలె గాడిదపై యెరూషలేం నగరంలోనికి ప్రవేశించాడు. రాచరిక మర్యాదకు భిన్నంగా, గాడిదపై ప్రయాణించడం అనేది మానవ ఆలోచన కాదు. ఇది ఏసు ప్రభు యొక్క వినమ్రతకు, నిరహంకారానికి ఉత్తమమైన ఉదాహరణ. మనం ఆయన అడుగుజాడల్ని అనుసరించాలి. జయించిన నగరాల్లోకి పూర్వం రాజులు శ్వేత అశ్వాలపై స్వారీచేస్తూ ప్రవేశించేవారు. కాని శాంతి పురుషులు డాబు దర్పములులేని గాడిదలపై ప్రయాణించేవారు.

యూదులు సింహం కోసం నిరీక్షించారు.
ఏసు గొర్రెపిల్లలా వచ్చాడు!
వారు సార్వభౌమాధికారి కోసం నిరీక్షించారు.
క్రీస్తు సేవకుడిగా వచ్చాడు!

## రాజ్యం – సంఘం ఒక్కటే

1. "నేను ఈ బండ మీద నా సంఘాన్ని నిర్మిస్తాను ... **పరలోక రాజ్యం** యొక్క తాళంచెవులు నీకు ఇస్తాను" (మత్తయి 16:18,19) అని పేతురుతో క్రీస్తు అన్నారు. నిర్మించేది సంఘం అయితే, దానిలో ప్రవేశించటానికి సంఘం యొక్క తాళంచెవులు ఇవ్వాలి. కాని, రాజ్యం యొక్క తాళంచెవులు ఇస్తానన్నారు. అంటే, రాజ్యం – సంఘం ఒకే దాన్ని సూచిస్తూ వాడబడిన పర్యాయపదాలు.

2. “కాబట్టి, **దేవుని రాజ్యం** మీ యొద్ద నుండి తీసివేసి, దాని ఫలాల్నిచ్చే జనులకు ఇయ్యబడుతుంది” అని కీర్తనలు 118:22,23 లో ఉన్న ప్రవచనాన్ని ప్రస్తావిస్తూ, క్రీస్తు తన రాజ్యాన్ని గూర్చి బోధించారు. ఇదే లేఖన భాగాన్ని 1 పేతురు 2:7లో ఎత్తిచెబుతూ సంఘంలో ప్రవేశింపని యూదుల్ని హెచ్చరించాడు. గనుక రాజ్యం, సంఘం ఒక్కటే అని నిర్ధారణ ఔతోంది. ఇది తిరుగులేని వాస్తవం.

3. కొలస్స పట్టణంలో ఉన్న క్రీస్తువులు (Christians) క్రీస్తులో, క్రీస్తు రాజ్యంలో, ఆయన శరీరమైన ఆయన సంఘంలో **ఉండిరి** అని కొలస్స 1:13,18,24 బోధిస్తున్నాయి. సంఘం – రాజ్యం ఒక్కటి కానట్లయితే, ఇదెట్లా సాధ్యమైంది?

| | | |
|---|---|---|
| రాజ్యం | – | సంఘం |
| రాజ్య నివాసులు | – | క్రీస్తువులు |
| రాజు | – | క్రీస్తు |
| రాజ్యాంగం | – | క్రొత్త నిబంధన |

“**రాజ్యం**” (బసిలేయా) అంటే— **పాలన**, పరిపాలన, ఏలుబడి, స్వామ్యం, ప్రభుత్వం. క్రీస్తు పాలనే క్రీస్తు రాజ్యం; క్రీస్తు రాజ్యమే క్రీస్తు సంఘం! దీనికి ఆధారం స్థంభం – సత్యం!

## రాజు – రాజ్య నివాసులు

1. “దేవుని రాజ్యం మాటలతో కాదు, **శక్తితోనే ఉంది**” (1 కొరింథీ 4:20). “దేవుని రాజ్యం వస్తుంది” అని కాదు గాని “వచ్చే ఉంది” అని ఈ వాక్యం

చెబుతోంది. "మీరు వినువారు మాత్రమై ఉండి మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి, వాక్కు ప్రకారం ప్రవర్తించువారై ఉండండి" (యాకోబు 1:22).

2. క్రీస్తు "మనల్ని అంధకార సంబంధమైన అధికారం నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన ప్రియ కుమారుని **రాజ్య నివాసులుగా చేసారు**" (కొలస్స 1:13). అపొస్తలుడైన పౌలుతో సహా మొదటి శతాబ్దం లోని క్రీస్తువులు అందరు "రాజ్య నివాసులై ఉండిరి" అని ఈ వాక్యం ఉద్ఘాటిస్తోంది. రాజ్యం లేకుండా వారు ఎట్లు రాజ్య నివాసులయ్యారు? "రాజ్య నివాసులుగా చేస్తాను" అని అనలేదు గాని "రాజ్య నివాసులుగా చేసారు" అని పౌలు వ్రాసాడు.

3. "మీ సోదరుడను ... **రాజ్యంలో పాలివాణ్ణి**" (ప్రకటన 1:9) అని అపోస్తలుడైన యోహాను చెప్పాడు. నేను రాజ్యంలో భాగస్తుణ్ణి అని అన్నాడు. రాజ్యం స్థాపించబడింది కాబట్టే, యోహాను దానిలో పాలివాడు కాగల్గాడు. ఉనికి లేని సంస్థలో ఒకడు ఎట్లు భాగస్తుడు కాగలడు?

4. "క్రీస్తు మనల్ని ప్రేమించి తన తండ్రియైన దేవునికి **రాజ్యంగా** యాజకులంగా చేసారు" (ప్రకటన 1:6). "మా దేవునికి వారిని ఒక **రాజ్యంగా** యాజకులుగా చేసావు" (ప్రకటన 5:10). అందుకనే, పేతురు క్రీస్తువుల్ని "ఏర్పర్చబడిన వంశం, **రాజులైన** యాజక సమూహం, పరిశుద్ధ జనం, దేవుని సొత్తైన ప్రజలై ఉన్నారు" అని అన్నాడు (1 పేతురు 2:9).

5. “మనం నిశ్చలమైన **రాజ్యం పొంది** దైవ కృప కలిగి ఉందాం. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవచేద్దాం” (హెబ్రీ 12:28). ఆ వాక్యాన్ని గమనిస్తే, ముందుగా రాజ్యం పొంది, దైవ కృప కల్గి, సేవ చేద్దాం అన్నాడు. రాజ్యం పొంది, రాజ్యంలో ఉండి, కృప కల్గి, సేవ చెయ్యాలి; అంతే గాని సేవ చేసిన తర్వాత రాజ్యం రాదు.

6. “దేవుని **రాజ్యం** భోజనం పానం కాదు గాని— నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ యందలి ఆనందమై ఉంది” (రోమీ 14:17). ఆహార విషయాల్లో సమస్య వచ్చినప్పుడు దేవుని రాజ్యం ఆధ్యాత్మిక సంబంధమైంది అని వివరిస్తూ పౌలు ఈ మాటలు చెప్పాడు.

7. “అన్యాయస్తులు దేవుని **రాజ్యానికి** వారసులు కారు” (1 కొరింథీ 6:9). “వ్యభిచారి, అపవిత్రుడు, విగ్రహారాధికుడు, లోభి క్రీస్తుకు దేవుని **రాజ్యానికి** వారసుడు కాడు” (ఎఫెసీ 5:5).

8. “ఆ సర్వాధిపతి **రాజులకు రాజు** ప్రభువులకు ప్రభువునై ఉన్నారు” (1 తిమోతి 6:15; ప్రకటన 19:16). క్రీస్తు రాజుగా రానేరారు, సుమారు రెండు వేల సంవత్సరాల నుండి రాజై ఉన్నారు. దేవుని లిఖితపూర్వక వాక్కు చాలా సరళమైంది మరియు సులువైంది; దానిని అర్థం చేసుకోవడానికి గొప్ప విద్య లేదా లోతైన ధ్యానం అవసరం లేదు. కాని వేదవేత్తలు దీన్ని క్లిష్టతరం చేసి అయోమయానికి గురిచేస్తున్నారు.

9. “యూదులకు **రాజు**గా పుట్టిన వాడు ఎక్కడ ఉన్నాడు” అని తూర్పు దేశపు జ్ఞానులు అడిగారు (మత్తయి 2:2). “క్రీస్తే” రాజు అని జ్ఞానులు

ఆనాడే గ్రహించారు. కాని నేటి అబద్ధ బోధకులకు రాజ్యాన్ని గూర్చి నేటికి అగమ్యగోచరంగా ఉంది.

10. “నీ **రాజ్యం** వచ్చు గాక!” (మత్తయి 6:10) అని రాజ్యం స్థాపింపబడక ముందు క్రీస్తు నేర్పిన “మాదిరి ప్రార్ధన్ని” కొందరు నేటికీ వల్లెవేస్తుంటారు. గాని క్రీస్తు రాజ్యాన్ని వారి హృదయం లోనికి రానివ్వరు. ప్రభువుకు హృదయాల్లో చోటు ఇవ్వరు. పరిశుద్ధ లేఖనాల్ని నమ్మరు.

## రాజ్యం లోనికి ప్రవేశం

“ఆ కాలంలో యెహోవా ఎరూషలేం నివాసులకు సంరక్షకుడుగా ఉంటాడు; ఆ కాలమున వారిలో శక్తిహీనులు దావీదు వంటివారుగా, దావీదు సంతతి వారు **దేవుని వంటివారు**గా, జనుల దృష్టికి **యెహోవా దూతల వంటి వారు**గా ఉంటారు” (జెకర్యా 12:8). “నీ **పరిపాలన** ఎన్నడూ ఎరుగని వారి వలె అయ్యాం. నీ **పేరు** ఎన్నడూ పెట్టబడని వారి వలె అయ్యాం” (ఎషయా 53:19). ఆందుకే క్రీస్తు ప్రభువు ఇట్లన్నారు: “మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని **పరలోక రాజ్యం**లో ప్రవేశింపరని మీతో నిశ్చయంగా చెబుతున్నాను” (మత్తయి 18:3). నేడు రాజ్యం ఉనికిలో ఉంది. గనుక రాజ్యం లోనికి ఎట్లు ప్రవేశించాలి? “ఏసు ఇట్లన్నారు— ‘ఒకడు నీటి మూలంగా ఆత్మ మూలంగా జన్మించితేనే గాని దేవుని **రాజ్యం**లో ప్రవేశింపలేడు’ అని నీతో నిశ్చయంగా చెబుతున్నాను” (యోహాను 3:5). నీవు దేవుని రాజ్యమైన క్రీస్తు యొక్క సంఘంలో ఉన్నావా లేక రాజ్యానికి బయట ఉన్నావా? ఒకసారి క్రీస్తుతో సంభాషించిన

శాస్త్రితో— "నీవు దేవుని రాజ్యానికి దూరంగా లేవు" – "You are not far from the kingdom of God" అని క్రీస్తు అన్నారు (మార్కు 12:34). అతను జన్మతః సమీపంగానే ఉన్నాడు! (He was near by the begettal). ఈ శాస్త్రి వలెనే తమరు కూడ రాజ్యానికి దగ్గరగా ఉన్నారా? రాజ్యంలో ప్రవేశించడానికి ఏమైనా ఆటంకం ఉందా?

"ఆయన తాను సృష్టించిన వాటిలో మనం ప్రథమ ఫలంగా ఉండేటట్లు సత్య వాక్కు వలన మనల్ని తన సంకల్ప ప్రకారం జన్మనిచ్చాడు" (యాకోబు 1:18). అంటే, దేవుని వాక్కు ప్రకారం క్రీస్తు లోనికి నిమజ్జనం (immersion) పొందినవారే, దేవుని రాజ్యంలో ప్రవేశిస్తారు. లేఖనాల్లో లేని ఆధ్యాత్మిక ప్రకటనలకు, మానవ ఆచారాలకు, కపట బోధలకు, తప్పుడు సిద్ధాంతాలకు బైబిలును ఎప్పుడూ ఆసరాగా (prop), ఆధారంగా ఉపయోగించకూడదు.

1. దేవుని వాక్కు వినడం – అజ్ఞానంపై, ఉదాసీనతపై విజయం కలుగజేస్తుంది.

2. క్రీస్తు ఏసులో విశ్వాసం – పాపాన్ని ప్రేమించడాన్ని అంత మొందిస్తుంది; రక్షకుడైన ఏసును విశ్వసించడంలో సందేహంపై విజయం కల్గుతుంది.

3. పశ్చాత్తాపం (మారుమనస్సు) – పాపపు అభ్యాసాన్ని అంతం చేస్తుంది; గత పాపాలను గూర్చిన పశ్చాత్తాపం నిర్దయరాహిత్యం పై విజయం కల్గుతుంది.

4. ప్రభువును నోటితో ఒప్పుకోవడం – పాపపు వ్యసనాన్ని నాశనం చేస్తుంది; ప్రభువును ఒప్పుకొనుట వలన పిరికితనంపై విజయం కల్గుతుంది.

5. ప్రభు నామాన్న నీటిలో నిమజ్జనం – గత పాప స్థితి నుండి విముక్తిచేస్తుంది; క్రీస్తులోనికి నిమజ్జనం దేవుని మీద తిరుగుబాటుపై విజయం కలుగజేస్తుంది.

6. దైవభక్తి గల జీవితం—— ఒకరిని పాపపు శిక్ష నుండి విమోచన చేస్తుంది.

క్రీస్తు రాజ్యంలో పాలివారుగా అవ్వాలని కోరుచున్నట్లయితే, ప్రభువు వాక్కుల్ని విశ్వసించి, తమరి పాపాల విషయమై పశ్చాత్తాపం పొంది, క్రీస్తును "ప్రభువు" అని నోటితో ఒప్పుకొని, పాప విముక్తికై నిమజ్జనం (బాప్తిస్మం) పొందండి; అప్పుడు మాత్రమే మీరు దేవుని రాజ్యంలో ప్రవేశింప గలరు; రాజ్యమందున్న దీవెనలు పొందగలరు. రాజ్యంలో ప్రవేశించిన పిమ్మట ఏమి చేయాలి?

# నీతిని వెతకండి

ఈ వ్యాసానికి మూల వాక్యమైన మత్తయి 6:33 నందు ఉన్న మొదటి విషయం— "**రాజ్యాన్ని వెతకటం**." రెండవది— "**నీతిని వెతకటం**." ఒక వ్యక్తి క్రీస్తు రాజ్యమైన క్రీస్తు సంఘం లోనికి ప్రవేశించిన పిమ్మట "నీతిని వెతకాలి." అందుకనే, క్రీస్తు ఇట్లన్నారు: "నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు, వారు తృప్తిపర్చబడతారు" (మత్తయి 5:6). "మీరు క్రీస్తు ఏసులో ఉన్నారు ... దేవుని మూలంగా ఆయన మనకు జ్ఞానం, **నీతి**, పరిశుద్ధత, మరియు విమోచన అయ్యాడు" (1 కొరింథీ 1:31). "యెహోవా మనకు **నీతి** అని **ఆయనకు పేరు** పెడతారు" (ఇర్మియా 23:6). "నీతి" అంటే "క్రీస్తు" అని స్పష్టమౌతోంది. గనుక "నీతిని వెతకటం" అంటే— క్రీస్తును వెతకటం.

యోహానుతో ప్రభువు ఇట్లన్నాడు: "**నీతి** యావత్తు ఇట్లు నెరవేర్చటం మనకు యుక్తమే" (మత్తయి 3:15). నీతిని నెరవేర్చుట అంటే దేవుని సమస్త ఆజ్ఞలు పాటించుటమే. "నేను మీకు ఏయే సంగతులు బోధించానో వాటన్నిటిని గైకొనాలని వారికి బోధించండి" (మత్తయి 28:20). ప్రభువు ఇట్లు ప్రార్థించారు: "**సత్యం** వలన వారు **పరిశుద్ధపర్చబడాలి**"(యోహాను 17:19; 1 పేతురు 1:22; యోహాను 15:3). "సత్యం వలన" మాత్రమే నీతిమంతులుగా తీర్చబడతారు. "ఆయన సమస్తమైన **దుర్నీతి** నుండి మనల్ని విమోచించి, సత్క్రియల యందు ఆసక్తిగల ప్రజల్ని తన కొరకు **పవిత్రపర్చుకొని** తన సొత్తుగా చేసికోటానికి తన్నుతానే మన కొరకు

అర్పించుకొన్నాడు" (తీతు 2:14). క్రీస్తు ప్రభువు తన స్వంత రక్తం ఇచ్చి సంపాదించిన ఆయన సంఘంలో ఉండి సమస్త ఆజ్ఞలు పాటించాలి.

"నీతి" అంటే దేవుని ఆజ్ఞలు (కీర్తన 119:142, 144,172). "మన దేవుడైన యెహోవా మనకు ఆజ్ఞాపించినట్లు ఆయన సన్నిధిని ఈ సమస్తమైన ఆజ్ఞల్ని అనుసరించి మనం నడుచుకొంటే మనకు **నీతి** కల్గుతుంది" (ద్వితీ 6:25). "సత్యం వినయంతో కూడిన **నీతిని** స్థాపించటానికి నీ ప్రభావాన్ని ధరించుకొని వాహనం ఎక్కి బయలుదేరు" (కీర్తన 45:4). "సొలొమోను దేవునికి ఇట్లు మనవి చేసాడు— '... దావీదు నీ దృష్టికి అనుకూలంగా **సత్యాన్ని నీతిని** అనుసరించి **యథార్థమైన** మనస్సుతో ప్రవర్తించాడు'" (1 రాజులు 3:6). "నీతిని అనుసరించని అన్యులు నీతిని, అంటే విశ్వాసమూలమైన **నీతి**ని పొందారు" (రోమీ 9:30). సత్యాన్ని అనుసరిస్తే యథార్థత కల్గుతుంది.

"క్రీస్తు నియమాన్ని పూర్తిగా నెరవేర్చండి" (గలతీ 6:2). "క్రీస్తు మీలో ఉంటే మీ శరీరం పాపం విషయంలో మృతమైంది. గాని మీ ఆత్మ **నీతి** విషయంలో జీవం కల్గి ఉంది" (రోమీ 8:10). "ప్రభువైన ఏసు క్రీస్తు పేరున మన దేవుని ఆత్మ ద్వారా మీరు ప్రక్షాళింపబడి, పరిశుద్ధపర్చబడి (made holy), **నీతిమంతులు**గా (declared righteous) తీర్చబడ్డారు" (1 కొరింథీ 6:11). "పరిశుద్ధత కల్గటానికి ఇప్పుడు మీ అవయవాల్ని **నీతి**కి అప్పగించండి" (రోమీ 6:19). దేవుని సత్య వాక్కు ప్రకారమైన నీతిగల జీవితం పరిశుద్ధతకు నడిపిస్తుందని దీని అర్థం. పవిత్రమైన మానవ హృదయం ఒక్కటే ఈ భూమి మీద సుందరమైన దేవుని ఆలయం!

“మనం ఆయన వలన **దేవుని నీతి** అవ్వాలని పాపం ఎరుగని ఆయనని మన కోసం పాపంగా చేసాడు” (2 కొరింథీ 5:21). “**నీతి**ని అభ్యసించే ప్రతివాడు నీతిమంతుడే” (1 యోహాను 3:7). “ప్రతి మనుష్యుని **క్రీస్తులో సంపూర్ణునిగా** చేసి ఆయన ఎదుట నిలబెట్టాలనే ఉద్దేశంతో, సమస్త విధాలైన జ్ఞానంతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధిచెబుతూ, ప్రతి మనుష్యునికి బోధిస్తూ, ఆయన్ని ప్రకటిస్తున్నాం” (కొలస్స 1:28). అందుకే “వారి హృదయాలను విశ్వాసం వలన పరిశుద్ధపర్చాడు” (అపొ 15:9). “మన ప్రభువైన ఏసు క్రీస్తు దినం నందు మీరు **నిరపరాధులై** ఉండేలా అంతం వరకు ఆయన మిమ్మల్ని స్థిరపరుస్తాడు” (1 కొరింథీ 1:8). మీ జీవితంలో దేవుని వాక్కు చదవడం మరియు అన్వయించుకోవడం ద్వారా మీ హృదయం, మనస్సు, ఆత్మకు పరిశుద్ధత కల్గును గాక!

క్రీస్తు సత్యసంపూర్ణుడు. “ఆ వాక్కు శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా [full of grace and truth] మన మధ్య నివసించాడు” (యోహాను 1:14). ఈ వాక్కు సశరీరుడయ్యాడు— “ప్రేమ-సత్యం” మిళితమైన ఒక వ్యక్తిగా మారాడు (ప్రకటన 19:13). సత్యసంధుడైన దేవుడు సత్య సంపూర్ణుడైన క్రీస్తు— సత్యవాది పరిశుద్ధాత్మ ద్వారా అనుగ్రహించిన సత్య వాక్కును అనుసరించి తమరు సత్యవర్తనులై “సత్యం” వలె, “వాక్కు” వలె జీవించాలి. క్రీస్తు దేవుని సందేశాన్ని జీవించాడు, ఆయన దేవుని సందేశాన్ని బోధించాడు, ఆయనే దేవుని సందేశం. దేవుడు మనకు ఆయన సందేశాన్ని కాగితంపై వ్రాయలేదు; ఆయన మనకు సజీవ సందేశమైన ఏసు క్రీస్తును పంపాడు!

హిజ్కియాకు ఎషయా ద్వారా దేవుడు ఇచ్చిన హెచ్చరికను వినండి: "నీ ఇంటిని చక్కదిద్దుకో" (ఎషయా 38: 1). తమరి హృదయాన్ని హిజ్కియా రాజు వలె తక్షణమే చక్కదిద్దుకోవాలి. తమరి హృదయాన్ని తన నివాసంగా చేసుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు. తమరి హృదయమే ఆయన రాజ్యం. "పరలోక రాజ్యం ఎట్లు ఉంటుంది? ప్రజలు స్వీయ-భావావరోధం (self-obsession) మరియు స్వీయ-సంతృప్తిని (self-fullfilment) విడిచిపెట్టి, ఇతరులను ప్రేమించడంలో ఆనందాన్ని కనుగొన్నప్పుడే ఇది జరుగుతుంది." మన రాజుగా మనపై పరిపాలన చేయటానికి క్రీస్తును నిరాకరిస్తే, మన ప్రధాన యాజకునిగా ఆయన ద్వారా మనం దేవుని దగ్గరకు వెళ్ళలేం.

"మాకు ఒక రాజును నియమించు" అని ఇశ్రాయేలీయులు అడిగినప్పుడు, సమూయేలుకు దేవుడు ఇట్లు చెప్పాడు— "వారు నిన్ను విసర్జించలేదు గాని **వారిని ఏలకుండ నన్నే విసర్జించారు**" (1 సమూ 8:7). ఆనాటి నుండి వారి హృదయాల్లో దేవునికి స్థానం లేదు; వారు సాతానుకే పెద్దపీట వేసారు. అందుకే "నీ **రాజ్యం** వచ్చు గాక; నీ **చిత్తం** పరలోకంలో నెరవేరుచున్నట్లుగా భూమి మీద కూడ నెరవేరు గాక!" (మత్తయి 6:10) అని క్రీస్తు తన శిష్యులకు నేర్పించారు. దీని అర్థం— హృదయాల్లో దేవుని పాలన వచ్చు గాక! పరలోకంలో వలెనే భూమి మీద కూడ సంఘంలో క్రీస్తు పరిపాలన జరుగు గాక! భూమిపై జీవిస్తున్న తన ప్రజల హృదయాల్లో గతంలో వలె దైవపాలన (theocracy) జరుగు గాక!

"నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడ్డాను. ఇకను జీవించే వాణ్ణి నేను కాను, క్రీస్తే నాలో జీవిస్తున్నాడు. నేను ఇప్పుడు శరీరంలో జీవిస్తున్న జీవితం నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతానే అప్పగించుకొన్న దేవుని కుమారుని మీద విశ్వాసం వలన జీవిస్తున్నాను" (గలతీ 2:20). అంటే— "నేను సిలువ వేయబడ్డాను," "నేను చనిపోయాను," "నేను ఇంక జీవించను" అని పౌలు ఉద్ఘాటించి చెబుతున్నాడు. క్రీస్తు మనలో నివసించగల ఏకైక మార్గం ఇదే కదా?

## తమరు ఒక విజేత!

ప్రభువు ఇట్లు అన్నారు: "నేను లోకాన్ని జయించాను!" (యోహాను 16:33). ప్రభువు సాతాన్ని ఓడించారు. కాని చితుకకొట్టబడ్డ శత్రువు నేటికీ అపాయకారియే. ఇప్పుడు ఒక ప్రశ్న: తమరు సాతాన్ని జయించారా, లేక సాతాను తమర్ని జయించాడా? దీనికి సరియైన జవాబు తమరే చెప్పగలరు. ఇది తమరి స్వంత ఇష్టం. "జయించడం" అనేది తమరి మనస్సులోనే మొదలవ్వాలి. దేవుని హామీ ఇదిగో: ప్రభు ఏసు క్రీస్తు సాతాను యొక్క "తలను చితుకకొడతాడు" (ఆది 3:15); దీని అర్థం— "అపవాది క్రియల్ని నాశనం చేయడానికే దేవుని కుమారుడు ప్రత్యక్షమయ్యాడు" (1 యోహాను 3:8). ప్రతి క్రీస్తువుని ధ్యేయం అపవాదిని ప్రహరించి (smite), వాని క్రియల్ని నాశనం చేయడమే కదా!

దేవుడు "సమస్తాన్ని ఆయన **పాదాల క్రింద** పెట్టాడు" (1 కొరింథీ 15:27). "సమస్తాన్ని ఆయన **పాదాల క్రింద** ఉంచి, సమస్తంపై ఆయన్ని

శిరస్సుగా నియమించాడు" (ఎఫెసీ 1:22). క్రీస్తు "శత్రువులందర్ని తన **పాదాల క్రింద** ఉంచే వరకు పరిపాలించాలి" (1 కొరింథీ 15:25). "సమాధానకర్తయైన దేవుడు మీ **పాదాల క్రింద** [క్రీస్తు శరీరమైన] సాతాన్ని శీఘ్రంగా చితుకత్రొక్కిస్తాడు" (రోమీ 16:20). "ఆయన **పాదాల క్రింద** సమస్తాన్ని ఉంచావు" (హెబ్రీ 2: 8). "సంఘం అనే శరీరానికి శిరస్సు" క్రీస్తు (కొలొస్స 1:18); సంఘం (ఎక్లేసియా) క్రీస్తు శరీరం; గనుక మనం ఆయన శరీరం. ఈ విధంగా సాతాను మన **పాదాల క్రింద** ఉన్నాడు; ఈ లోకంలోని సమస్తం మన పాదాల క్రింద ఉంది. అంటే— మనం అపవాదికి పైన ఉన్నాం. కాని అనేక మంది సాతానుణ్ణి నెత్తి మీద పెట్టుకొని ఊరేగుతున్నారు. లోకాన్ని హృదయంలో పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నారు. ఈ సూక్ష్మమైన సత్యాన్ని సరిగా గ్రహించండి: క్రీస్తువుల "పాదాల క్రింద" సాతాను ఉండాలే కాని— క్రీస్తువుల శిరస్సుపై, క్రీస్తువుల హృదయంలో, లేదా క్రీస్తువుల మనస్సులో కాదు. దేవుని వాక్కు ప్రకారం తమరు జీవించాలని సాతాను కోరుకోడు; తమరు చేయకూడనిది చేయాలని సాతాను కోరుకొంటాడు. గనుక ప్రతి రోజూ ఇతరులు తమరిలో ఒక మంచి వ్యక్తిని చూసే విధంగా జీవిస్తూ ఉండండి; ప్రతి దినం క్రీస్తులో ఎదుగుతూ ఉండండి.

"దేవునితో మేం విజయం పొందుతాం" (కీర్తన 60:12) – "With God we will gain the victory" (NIV). గనుక "అపవాదికి చోటు ఇవ్వకండి" (ఎఫెసీ 4:27). సత్యాన్ని కనుగొనడం అనేది విజయాన్ని తెచ్చే విధంగా నిత్య రాజ్యంతో జోడించే సాధనం. నులివెచ్చని జీవితం వ్యర్థమే

కదా! (ప్రకటన 3:16). జీవితంలో నిప్పు రాజకపోతే విజయమే లేదు. ప్రేమతో ప్రజ్వలించండి. సత్యంతో ముందుకు సాగండి. సాతాను శక్తుల్ని ఎదుర్కోండి. "మొదటి మరియు ఉత్తమ విజయం— నిన్ను నీవు జయించడమే. నిన్ను నీవు జయించ లేకపోతే అది చాలా సిగ్గుచేటు మరియు అభ్యంతరకరం" (ప్లేటో). "కీడు వలన అపజయం పొందక, మేలుతో కీడుని జయించండి" (రోమీ 12:21). విజేతలుగా జీవించండి. గుర్తుంచుకోండి— దేవుడు ఎన్నడు ఆశ్చర్యపోడు లేదా ఓడిపోడు. ఆమోసు (4:12) చేసిన హెచ్చరికను గమనించండి— "మీ దేవుణ్ణి కలవడానికి సిద్ధపడండి!"

"మీరు క్రీస్తు వారు; క్రీస్తు దేవునివాడు" (1 కొరింథీ 3:23). "మీరు దేవుని ఆలయమై ఉన్నారు, దేవుని ఆత్మ మీలో నివసిస్తున్నాడు అని మీరు ఎరుగరా? ఎవడైనా దేవుని ఆలయాన్ని పాడుచేస్తే దేవుడు అతణ్ణి పాడుచేస్తాడు. దేవుని ఆలయం పరిశుద్ధమై ఉంది; మీరు ఆ ఆలయమై ఉన్నారు" (1 కొరింథీ 3:16:17). గనుక తమరి దేహం నుండి తమరే రక్షించుకోవాలి!

"ఆత్మ **పూర్ణులై** ఉండండి" (ఎఫెసీ 5:19). "క్రీస్తు వాక్కు మీలో **సమృద్ధిగా** నివసింపనియ్యండి" (కొలస్స 3:16). కీర్తనకర్త ఇట్లన్నాడు: "నేను నీకు వ్యతిరేకంగా పాపం చేయకుండా ఉండటానికి నీ **వాక్కును** నా హృదయంలో **నిధిగా** దాచుకున్నాను" (కీర్తన 119:11). "సత్యం నందు వారిని **ప్రతిష్టించు**; నీ వాక్కే సత్యం" (యోహాను 17:17). సత్యం క్రీస్తువుల జీవితానికి స్థంభం మరియు ఆధారం. "హృదయాల్లో క్రీస్తును ప్రభువుగా

**ప్రతిష్టించండి**" (1 పేతురు 3:15). క్రీస్తుకు "దేవుని **వాక్కు** అను **నామం** ఆయనకు పెట్టబడింది" (ప్రకటన 19:13). తమరి హృదయాన్ని— రారాజుకి రాజ్యంగా, దేవుని వాక్కుకు ఖజానాగా, సత్యానికి ధామంగా, ప్రేమకు వాహకంగా మార్చండి!

నేటి వరకు, తమరు క్రీస్తును ప్రభువుగా తమరి జీవిత సింహాసనంపై ప్రతిష్టించంకపోతే— తమరు ఆ సింహాసనంపై ఉన్నట్లే. తమరు ఆ గద్దెదిగి (dethrone), క్రీస్తును తమరి హృదయ సింహాసనంపై అధిష్టించటానికి (enthrone) చైతన్యమైన (conscious) నిర్ణయం తీసుకోండి. "క్రీస్తు అనుగ్రహించే సమాధానం మీ హృదయాల్లో **ఏలుచుండ** నియ్యండి" (కొలస్స 3:15). "నీ ప్రవర్తన **అంతటిలో** ఆయన **అధికారానికి** అంగీకరించు" (సామెతలు 3:6). "వాక్కు నీ దగ్గర, నీ నోటిలో, నీ హృదయంలో ఉంది" (రోమీ 10:8). మానవ హృదయం ప్రభువు పరిపాలించే ప్రదేశం. తమరి హృదయాన్ని దేవునికి సుందరమైన ఆలయంగా మార్చండి.

క్రీస్తువులు "గొర్రెపిల్ల రక్తం వలన, తామిచ్చిన సాక్ష్యం వలన వాణ్ణి జయించారు. గాని, మరణం వరకు తమ ప్రాణాల్ని ప్రేమించినవారు కారు" (ప్రకటన 12:11). ప్రతి క్రీస్తువుడు "ఏసు క్రీస్తు యొక్క మంచి సైనికుడు" (2 తిమోతి 2:3), మరియు ప్రాపంచిక వాంఛల్ని జయించేవాడు: "జయించేవాడు వీటిని వారసత్వంగా పొందుతాడు, నేను అతనికి దేవుణ్ణి, అతడు నాకు కుమారుడు" (ప్రకటన 21: 7). శాంతి భావన మరియు సమాధాన సాధన అనేవి సాతానుకు వ్యతిరేకమైన శక్తివంతమైన

ఆయుధాలు. సాతాను అణచివేయబడ్డ ఒక శత్రువు; పాపం ఓడిపోయిన విరోధి. గనుక పాపంతో యుద్ధం చేయండి. ప్రజలతో ప్రేమగా శాంతిగా సామరస్యంగా సమాధానంగా జీవించండి!

# క్రీస్తు ప్రత్యక్షతలో రాజ్యం ఏమౌతుంది?

## భూగోళం ఏమౌతుంది?

"'ఇదిగో క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, అదిగో అక్కడ ఉన్నాడు' అని ఎవడైనా మీతో చెబితే నమ్మకండి. ఆ కాలంలో కపట క్రీస్తులు అబద్ధ ప్రవక్తలు వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని మోసగించటానికి సూచక క్రియల్ని మహత్కార్యాల్ని చేస్తారు. మీరు జాగ్రత్తగా ఉండండి; ఇదిగో మీతో అన్నీ ముందుగా చెబుతున్నాను. ఆ దినాల్లో ఆ శ్రమ తీరిన తర్వాత సూర్యుడు చీకటైపోతాడు, చంద్రుడు తన కాంతిని ఇవ్వడు, ఆకాశం నుండి నక్షత్రాలు రాలిపోతాయి, ఆకాశం లోని శక్తులు కదులుతాయి. అప్పుడు మనుష్య కుమారుడు మహా ప్రభావంతో మహిమతో **మేఘారూఢుడై రావడం** చూస్తారు" (మార్కు 13:21–25; మత్తయి 24:23–31). ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, ప్రపంచవ్యాప్త వ్యాధులు ప్రబలినా, కీటకాల దండ్లు పంటలపై దాడిచేసినా, దుర్మార్గాలు హింసలు పెచ్చరిల్లినా— "క్రీస్తు రాకడ ఆసన్నమైంది" అని కొందరు వదంతులు పుట్టిస్తే, మరికొందరు తేదీల్ని ఖరారుచేస్తుంటారు, ఇంకొందరు టీవీల్లో ఊదరగొడుతుంటారు.

"ఆ దినం గాని ఆ గడియ గాని తండ్రికి మాత్రమే తెలుసు. ఏ నరుడైనా పరలోకంలోని దూతలైనా కుమారుడైనా ఎరుగరు" (మత్తయి 24:36). "ఇదిగో నేను త్వరగా వస్తున్నాను, ఈ గ్రంథంలోని ప్రవచన వాక్యాల్ని గైకొనే వాడు ధన్యుడు" (ప్రకటన 22:7). "మేం ప్రభువు మాటను బట్టి మీతో చెప్పేది ఏమంటే, **ప్రభువు రాకడ** వరకు సజీవులమై ఉండే మనం

నిద్రించినవారి కంటె ముందుగా ఆయన సన్నిధి చేరం. ఆర్భాటంతో, ప్రధాన దూత శబ్దంతో, దేవుని బూరతో పరలోకం నుండి ప్రభువు దిగి వస్తాడు; క్రీస్తులో ఉండి మృతులైనవారు మొదట లేస్తారు. పిమ్మట సజీవులమై ఉన్న మనం వారితో కూడ కలిసి ప్రభువును ఎదుర్కోటానికి ఆకాశమండలానికి **మేఘాల మీద కొనిపోబడతాం**. కాగా మనం సదా కాలం ప్రభువుతో కూడ ఉంటాం" (1 థెస్స 4:15–17). క్రీస్తు **భూమి మీదికి రానేరాడు; ఆయన్ని** సజీవులు **ఆకాశంలో కలుసుకొంటారు**. అందుకే, క్రీస్తు యొక్క "**రెండవ రాకడ**" (second coming) అనే పదబంధం (phrase) క్రొత్త నిబంధనలో ఎక్కడా కన్పించదు; లేఖనాల్ని విశ్వసించే ప్రతి క్రీస్తువుడు ఈ సత్యాన్ని గుర్తుంచుకోవాలి!

"మనుష్యులు ఒక్కసారే మృతినొందాలి అని నియమింపబడింది; ఆ తర్వాత తీర్పు జరుగుతుంది" (హెబ్రీ 9:27). "ప్రతివాడు తన తన వరుసలోనే బ్రతికింపబడతాడు. ప్రథమ ఫలం క్రీస్తు; తర్వాత క్రీస్తు ఆగమనంలో ఆయన వారు బ్రతికింపబడతారు. పిమ్మట ఆయన సమస్త ఆధిపత్యాన్ని, సమస్త అధికారాన్ని, శక్తిని కొట్టివేసి తన తండ్రియైన **దేవునికి రాజ్యం అప్పగిస్తాడు**; అప్పుడు అంతం వస్తుంది" (1 కొరింథీ 15:23,24). క్రీస్తు ఇప్పుడు పరిపాలిస్తున్న వారిని— "ఆయన ప్రత్యక్షతలో రాజ్యాన్ని తండ్రి వశం చేస్తాడు" అని బైబిలు స్పష్టంగా బోధిస్తుంటే, "క్రీస్తు వచ్చినప్పుడు రాజ్యం స్థాపిస్తాడు" అని అబద్ధ బోధకులు ప్రకటిస్తున్నారు. ఇది ఎంత హాస్యాస్పదం!

“ఇప్పుడున్న ఆకాశం భూమి భక్తిహీనుల తీర్పు, నాశనం జరుగు దినం వరకు అగ్ని కొరకు నిలువచేయబడి, అదే వాక్కు వలన భద్రం చేయబడ్డాయి ... అయితే ప్రభువు దినం దొంగ వచ్చినట్లు వస్తుంది. ఆ దినాన్న ఆకాశాలు మహా ధ్వనితో గతించిపోతాయి, పంచభూతాలు మిక్కలి **ఉష్ణంతో** లయమైపోతాయి, భూమి దాని మీద ఉన్న కృత్యాలు కాలిపోతాయి. ఇవన్నీ ఇట్లు లయమైపోతాయి గనుక, ఆకాశాలు రవులుకొని లయమైపోయే, పంచభూతాలు మహావేండ్రంతో కరిగిపోయే దేవుని దినపు రాకడ కొరకు కనిపెడుతూ, దాన్ని ఆశతో అపేక్షిస్తూ, మీరు **పరిశుద్ధ**మైన ప్రవర్తనతో భక్తితో ఎంతో జాగ్రత్తగలవారై ఉండాలి” (2 పేతురు 3:7–12). క్రీస్తు యొక్క ప్రత్యక్షతలో భూమి కాలిపోతుంది అని లేఖనాలు ప్రబోధిస్తున్నాయి. ప్రభువైన క్రీస్తు భౌతికంగా ఎప్పుడూ భూమిపైకి తిరిగి రారు!

క్రీస్తు “సింహాసన ఆసీనుడై పరిపాలిస్తాడు, సింహాసన ఆసీనుడై యాజకత్వం చేస్తాడు” (జెకర్యా 6:13). “నీవు నా కుడి పార్శ్వాన కూర్చోమని ప్రభువు నా ప్రభువుతో చెప్పాడు” (అపో 2:30–35). “మేఘాలు ఆయనకు పాదధూళిగా ఉన్నాయి” (నహూం 1:3). “ఆకాశం నా సింహాసనం, భూమి నా పాదపీఠం” అని పేతురు “క్రీస్తు పాలన” గూర్చి చెప్పాడు (ఎషయా 66:1; అపో 7:49). రాజులకు రాజైన క్రీస్తు సింహాసనం (throne) పైనే గాని పాదపీఠమైన (footstool) భూమిపై ఎట్లు ఆసీనుడౌతాడు?

“సోదరులారా, **ప్రభువు దినం** ఇప్పుడే వచ్చినట్లుగా ఆత్మ వలనైనా, మాట వలనైనా, మా దగ్గర నుండి వచ్చిందని చెప్పిన పత్రిక వలనైనా, ఎవడైనా

చెబితే మీరు త్వరపడి చంచల మనస్కులు కావద్దు, బెదరవద్దు అని మన ప్రభువైన ఏసు క్రీస్తు రాకడను బట్టి, మనం ఆయన దగ్గర కూడుకొనటాన్ని బట్టి  మిమ్మల్ని వేడుకొంటున్నాం. మొదట భ్రష్టత్వం సంభవించి నాశన పాత్రుడగు పాప పురుషుడు బయల్పడితేనే గాని ఆ దినం రాదు. ఏది దేవుడు అనబడుతుందో, ఏది పూజింపబడుతుందో, దాన్నంతటిని ఎదిరిస్తూ, దానికి అంతటికి పైగా వాడు తన్నుతానే హెచ్చించుకొంటూ, **తానే దేవుణ్ణి** అని తన్ను కనుపర్చుకొంటూ, దేవుని ఆలయంలో కూర్చుంటాడు. గనుక ఏ విధంగానైనా ఎవడూ మిమ్మల్ని మోసపర్చనియ్యకండి. నేను మీ దగ్గర ఉన్నప్పుడు ఈ సంగతుల్ని మీతో చెప్పింది మీకు జ్ఞాపకం లేదా? కాగా వాడు తన సొంత కాల మందు బయల్పర్చబడాలి అని వాణ్ణి అడ్డగించేది ఏదో అది మీకు తెలుసు. ధర్మవిరోధ సంబంధమైన మర్మం ఇప్పటికే క్రియాశీలకం ఉంది గాని, ఇది వరకు అడ్డగిస్తున్నవాడు మధ్య నుండి తీసివేయబడే వరకు అడ్డగిస్తాడు. అప్పుడు ఆ ధర్మవిరోధి బయల్పర్చబడతాడు. ప్రభువైన యేసు తన నోటి ఊపిరి చేత వాణ్ణి సంహరించి తన ఆగమన ప్రకాశం చేత నాశనం చేస్తాడు. నశిస్తున్నవారు తాము రక్షింపబడటానికి సత్య విషయమైన ప్రేమను అవలంబించ లేదు గనుక, వారి రాక అబద్ధ విషయమైన సమస్త బలంతో, నానా విధాలైన సూచకక్రియలతో, మహత్కార్యాలతో దుర్నీతిని పుట్టించే సమస్త మోసంతో, నశిస్తున్న వారిలో సాతాను కన్పర్చే  బలాన్ని అనుసరించి ఉంటుంది. ఇందుచేత సత్యాన్ని నమ్మక దుర్నీతి యందు అభిలాషగల వారందరు శిక్షావిధి పొందటానికి, అబద్దాన్ని నమ్మేటట్లు మోసగించే శక్తిని దేవుడు వారికి పంపుతున్నాడు" (2 థెస్స 2:1-11). క్రీ.శ

606 లో వెలసిన ఒక భ్రష్ట సంఘానికి (apostate church), అంటే కేతొలిక్కు సంఘానికి బోనిఫేస్ III శిరస్సుగా మరియు పోపుగా ప్రకటింపబడి నప్పటి నుండి పై ప్రవచం నెరవేరుతునే ఉంది. ఆ సంఘం బైబిల్లో కన్పించని బిరుదులు, మోసపు కృత్యాలు, నీచ సంప్రదాయాలు, అనేక అబద్ద బోధలు లోకానికి పరిచయం చేస్తూనే ఉంది.

## క్రొత్త ఆకాశం – క్రొత్త భూమి

క్రొత్త నిబంధనలో పేర్కొన్న క్రొత్త ఆకాశం క్రొత్త భూమిని గూర్చిన లేఖన భాగాలు: "అంతట నేను **క్రొత్త ఆకాశాన్ని క్రొత్త భూమిని** చూసాను. **మొదటి ఆకాశం మొదటి భూమి గతించిపోయింది**. సముద్రం ఇకను లేదు. మరియు నేను **నూతన యెరూషలేం** అనే **పరిశుద్ధ పట్టణాన్ని** తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తె వలె సిద్ధపడి పరలోకంలో ఉన్న **దేవుని దగ్గర** నుండి **దిగి వచ్చుట** చూసాను" (ప్రకటన 21:1,2). "పరలోకంలోని నా దేవుని దగ్గర నుండి **దిగి వస్తున్న** క్రొత్త యెరూషములేంను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్త పేరును వాటి మీద వ్రాస్తాను" (ప్రకటన 3:12). భవిష్యత్తులో సంభవించబోయే "ప్రభువు ప్రత్యక్షత" గూర్చి యోహాను చెప్పాడు. "మనం ఆయన వాగ్దానాన్ని బట్టి క్రొత్త ఆకాశం [οὐρανός – *oo-ran-os'* – heaven] కొరకు, క్రొత్త భూమి కొరకు ఎదురు చూస్తున్నాం; వాటిలో **నీతి** నివసిస్తుంది" (2 పేతురు 3:13). ఆకాశాలు మహా ధ్వనితో గతించిపోతాయి, పంచభూతాలు మిక్కలి ఉష్ణంతో

లయమైపోతాయి, భూమి దాని మీద ఉన్న కృత్యాలు కాలిపోతాయి. గనుక క్రీస్తు ప్రత్యక్షత తర్వాత ఈ భూమి నేడు ఉన్నట్లుగా ఉండదు!

నిజానికి, “క్రొత్త ఆకాశం, క్రొత్త భూమి” పరలోకానికి ఒక పరోక్ష సూచన లేక చిహ్నం (New heaven is an allusion or symbol for heaven). “నా తండ్రి ఇంట అనేక నివాసాలు కలవు, లేనిచో మీతో చెబుతాను; మీకు స్థలం సిద్ధపర్చటానికి వెళ్తున్నాను. నేను వెళ్లి మీకు స్థలం సిద్ధపరిస్తే, నేను ఉండే స్థలంలో మీరును ఉండేటట్లు మరల వచ్చి నా దగ్గర ఉండటానికి  మిమ్మల్ని తీసికొని వెళ్తాను. నేను వెళ్తున్న స్థలానికి మార్గం మీకు తెలుసు” (యోహాను 14:2–4). “వారు చూస్తుండగా ఆయన [క్రీస్తు] ఆరోహణుడయ్యాడు. అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘం ఆయన్ని కొనిపోయింది. ఆయన వెళ్తుండగా, వారు **ఆకాశం వైపు** తేరి చూస్తూ ఉండిపోయారు. ఇదిగో తెల్లని వస్త్రాలు ధరించుకొన్న ఇద్దరు మనుష్యులు వారి దగ్గర నిలిచి– ‘గలిలయ మనుష్యులారా, మీరు ఎందుకు నిలిచి ఆకాశం వైపు చూస్తున్నారు? మీ దగ్గర నుండి పరలోకానికి చేర్చుకోబడిన ఈ ఏసే, ఏ రీతిగా పరలోకానికి వెళ్లటం మీరు చూసారో ఆ రీతిగానే ఆయన తిరిగి వస్తారు’ – అని వారితో చెప్పారు” (అపొ 1:9–11). మనం కూడ ప్రభువును ఎదుర్కోటానికి  మేఘాల మీద కొనిపోబడతాం.

ఇదిగో ఆయన మేఘారూఢుడై వస్తున్నాడు; ప్రతి నేత్రం ఆయన్ని చూస్తుంది. ఆయన్ని పొడిచినవారు చూస్తారు; భూజనులు అందరు ఆయన్ని చూచి రొమ్ము కొట్టుకొంటారు” (ప్రకటన 1:7). “ఒక సంగతి

మర్చిపోకండి. ఏమంటే, ప్రభువు దృష్టికి ఒక దినం వెయ్యి సంవత్సరాల వలె, వెయ్యి సంవత్సరాలు ఒక దినం వలెను ఉన్నాయి. కొందరు ఆలస్యం అని ఎంచుకొనుచున్నట్లు ప్రభువు తన వాగ్దానాన్ని గూర్చి ఆలస్యం చేసేవాడు కాడు. గాని ఎవడును నశించాలని ఇచ్ఛయింపక, అందరు **మారుమనస్సు** పొందాలని కోరుతూ, మీ యెడల దీర్ఘశాంతం గలవాడై ఉన్నాడు" (2 పేతురు 3:8,9). గనుక పరివర్తన (change), మారు మనస్సు, పశ్చాత్తాపం తమరి నుండే ఆరంభించబడాలి.

"మీ కొరకు నియమించిన క్రీస్తు ఏసును ఆయన పంపిస్తాడు. మీ పాపాలు తుడిచివేయబడటానికి మారుమనస్సు నొంది తిరగండి. అన్నిటికి కుదురుబాటు కాలాలు వస్తాయని దేవుడు ఆది నుండి తన పరిశుద్ధ ప్రవక్తల నోట పలికించాడు. అంత వరకు ఏసు పరలోక నివాసియై ఉండటం ఆవశ్యకం" (అపొ 3:20,21). "మన యెడల **ప్రత్యక్షం** కాబోయే మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని ఎంచుచున్నాను. దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మిగుల ఆశతో ఎదురుచూస్తోంది. ఎందుకంటే, సృష్టి నాశనానికి అప్పగింప బడింది" (రోమీ 8:18–20).

"మన ప్రభువైన ఏసు క్రీస్తు **ప్రత్యక్షమయ్యే** వరకు నీవు నిష్కళంకంగా అనింద్యంగా ఈ ఆజ్ఞను గైకొనాలని నీకు ఆజ్ఞాపిస్తున్నాను. శ్రీమంతుడు ఏకైక సర్వాధిపతి యుక్తకాలంలో ఆ ప్రత్యక్షతను కనుపరుస్తాడు. ఆ సర్వాధిపతి రాజులకు రాజు ప్రభువులకు ప్రభువై ఉన్నాడు. సమీపింప రాని తేజస్సులో ఆయన మాత్రమే వసిస్తూ అమరత్వంగలవాడై ఉన్నాడు. మనుష్యుల్లో ఎవడూ ఆయన్ని చూడలేదు, ఎవడూ చూడనేరడు; ఆయనకు

ఘనత శాశ్వతమైన ప్రభావం కల్గును గాక. తథాస్తు" (1 తిమోతి 6:14–16). "ఆయన **ప్రత్యక్షం** ఐనప్పుడు ఆయన ఉన్నట్లుగానే ఆయన్ని చూస్తాం. గనుక ఆయన **పోలికగా** ఉంటాం అని తెలుసు. ఆయనలో ఈ నిరీక్షణపెట్టుకొన్న ప్రతివాడు ఆయన పవిత్రుడై ఉన్నట్లుగా తననుతానే పవిత్రునిగాచేసికొంటాడు" (1 యోహాను 3:2,3). "హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూస్తారు" (మత్తయి 5:8). "పరిశుద్ధత లేకుండ ఎవడూ ప్రభువును చూడడు" (హెబ్రీ 12:14). యాకోబు 4:8 ఇట్లు హెచ్చరిస్తోంది: "మీ హృదయాల్ని పరిశుద్ధ పర్చుకోండి."

# ప్రకటన 20:1—6 సంగతి ఏమిటి?

పరిశుద్ధ లేఖనాలకు భాష్యం చెప్పడానికి ఒక మంచి సూత్రం ఉంది: "బైబిలు దానికి అదే స్వంత ఉత్తమ వ్యాఖ్యానం!" (The Bible is its own best commentary!). "బయల్పాటు అంటే— 'దేవుడు చెప్పింది.' వ్యాఖ్యానం అంటే— 'దేవుడు చెప్పిన దానికి ఇదే అర్థం' అని మనం అనుకోవటం." సంకేతాత్మకమైన, అలంకారికమైన, గూఢార్థ లేఖన భాగాల్ని యథాతథంగా భాష్యం చెప్పటం, ఉపమానం నుండి ఖచ్చితంగా వివరించడం ఎప్పుడూ సులభం కాదు. బైబిలులో ఉన్న యెహెజ్కేలు మరియు ప్రకటన గ్రంథం వంటి పుస్తకాలు దీనికి చక్కని ఉదాహరణలుగా చెప్పవచ్చు.

"పగలు రాత్రి దేవుని ఎదుట మన సోదరుల మీద నేరం మోపే అపవాది పడద్రోయబడ్డాడు. కాబట్టి ఇక మన దేవుని రక్షణ, శక్తి, **రాజ్యం** వచ్చాయి. ఆయన అభిషిక్తుడైన క్రీస్తుకు అధికారం వచ్చింది" (ప్రకటన 12:10). "ఈ లోక రాజ్యం మన ప్రభువువైన క్రీస్తు రాజ్యం అయ్యింది; ఆయన యుగయుగాలు పరిపాలిస్తాడు" (ప్రకటన 11:15). వెయ్యి సంవత్సరాల భూసంబంధ స్వామ్యాన్ని (terrestrial reign) మనం అక్షరాలా తీసుకుందామా లేక అలంకారికంగా తీసుకుందామా? యోహాను 18:36లో— "నా రాజ్యం ఈ లోక సంబంధమైంది కాదు" అని పిలాతుకు ఏసు ఖరాఖండిగా చెప్పిన "ప్రతిజ్ఞావచనం" ఏమౌతుంది? దాన్ని ఎట్లు సరిదిద్దగలం? క్రీస్తు యొక్క ప్రస్తుత పాలన ఆధ్యాత్మికమైంది; "ఈ

లోక సంబంధమైంది కాదు." ఇది భూమిపై ఉన్న లౌకిక రాజ్యాల్ని, ప్రభుత్వాల్ని పోలి ఉండదు. మన భక్తికి నిత్య జీవానికి ఆధారం మరియు ప్రభువైన ఏసుతో మనకు ఉండవలసిన వ్యక్తిగత సంబంధమే గాని వివాదాస్పద సిద్ధాంతాలు అబద్ద బోధలు తప్పుడు ప్రకటనలు కాదు.

"తర్వాత పెద్ద సంకెళ్లను చేత పట్టుకొని అగాధం యొక్క తాళపుచెవి గల ఒక దేవ దూత పరలోకం నుండి దిగి రావడం చూసాను. అతడు ఆది సర్పాన్ని, అంటే అపవాది మరియు సాతాను అనే ఆ మహాసర్పాన్ని పట్టుకొని వెయ్యి సంవత్సరాలు వాణ్ణి అగాధంలో బంధించివేసాడు. ఆ వెయ్యి సంవత్సరాలు గడిచే వరకు ఇక జనాల్ని మోసపరచకుండా అగాధాన్ని మూసి దానికి ముద్ర వేసాడు; అటు పిమ్మట వాడు కొంచెం కాలం విడిచిపెట్టబడాలి. అంతట సింహాసనాన్ని చూసాను; వాటి మీద ఆసీనులై ఉండే వారికి విమర్శచేసే అధికారం ఇవ్వబడింది. మరియు క్రూరమృగానికి దాని ప్రతిమకు  నమస్కారం చేయక, తమ నొసళ్ల మీద గాని చేతుల మీద గాని దాని ముద్రను వేయించుకోని వారిని, ఏసును గూర్చి సాక్ష్యం చెప్పినందుకు, దేవుని వాక్కు ప్రకటించి నందుకు శిరచ్ఛేదనం  చేయబడిన వారి ఆత్మల్ని చూసాను. వారు బ్రతికినవారై, వెయ్యి సంవత్సరాలు క్రీస్తుతో కూడ రాజ్యం చేసారు. ఆ వెయ్యి సంవత్సరాలు గడిచే వరకు మిగిలిన మృతులు బ్రతక లేదు; ఇదియే మొదటి పునరుత్థానం. ఈ **మొదటి పునరుత్థానం**లో పాలుగలవారు ధన్యులు పరిశుద్ధులునై ఉంటారు. ఇలాంటి వారి మీద **రెండవ మరణానికి** అధికారం లేదు; వీరు దేవునికి క్రీస్తుకు యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరాలు రాజ్యం చేస్తారు" (ప్రకటన

20:1–6). "వెయ్యి ఏండ్ల పాలన రానై ఉంది" అని బోధించేవారికి పై లేఖన భాగం ఏ మాత్రం వత్తాసు పల్కుట లేదు!

**ప్రకటన 20:1–6** ఆధారంగా చేస్తున్న ఈ క్రింది బోధలు ఏ మాత్రం ఈ లేఖనంలో **కన్పించవు**:

1. క్రీస్తు రాకడ / క్రీస్తు ఆగమనం / ప్రభువు ప్రత్యక్షత.
2. క్రీస్తు భూమి మీదకు భౌతికంగా వస్తారు.
3. క్రీస్తు యెరూషలేంలో రాజ్యం స్థాపించి, అక్కడ నుండి పరిపాలిస్తాడు.
4. క్రీస్తు భూమిపై దావీదు సింహాసం మీద వెయ్యి ఏండ్లు ఏలుతాడు.
5. క్రీస్తువుల భౌతిక పునరుత్థానం.

**ప్రకటన 20:1–6 బోధిస్తున్న వాస్తవాల సారాంశం**:

1. ఈ లోకంలో సాతాను యొక్క ప్రభావం పూర్తిగా తొలగి పోలేదు.
2. క్రీస్తు వాక్కు ఎక్కడ ప్రకటించబడుతుందో అక్కడ సాతాను ప్రభావం క్షీణించిపోతుంది.
3. క్రీస్తు కొరకు శ్రమ పొందుట శ్రేయస్కరం.
4. ఎందుకంటే, క్రీస్తు విజయశాలి గనుక క్రీస్తువులు తుదకు విజేయులు ఔతారు.
5. తీర్పు జరుగనై ఉంది. అటు పిమ్మట సాతాను నరకంలో వేయబడతాడు.

"వీరు దేవునికి క్రీస్తుకు యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరాలు రాజ్యం చేస్తారు" (ప్రకటన 20:6) అంటే, విశ్వాసనీయంగా జీవించిన

క్రీస్తువులు పాలితులు కారు. కాని పాలకులు అని ఈ లేఖన భాగం స్పష్టంగా బోధిస్తోంది. "క్రీస్తుతో ... రాజ్యం చేస్తారు" అంటే, పరిపాలన చేస్తారు. క్రీస్తువులు రాజులు; రాజు అంటే— తన హృదయంలో అపవాదికి చోటివ్వక, తనపై పాపాన్ని ఏలనివ్వక, క్రీస్తు వాక్కుతో తననుతాను పాలించుకొనేవాడు. ఇట్లాంటి రాజుల (క్రీస్తువుల) హృదయాలను పాలించే క్రీస్తు రారాజు! క్రీస్తుతో కూడ క్రీస్తువులు ఆధ్యాత్మిక రాజసం కల్గి ఏలుతున్నారు; వీరే క్రీస్తు సంఘు సభ్యులు!

దేవుడు "నియమించిన మనుష్యుని ద్వారా **నీతి** వలన భూలోకానికి తీర్పుతీర్చ బోయే ఒక దినం నిర్ణయించాడు. మృతుల్లో నుండి ఆయన్ని లేపినందు వలన దీన్ని నమ్మటానికి అందరికి ఆధారం కలుగజేసాడు" (ఆపొ 17:31). "సమాధానకర్తయైన దేవుడే మిమ్మల్ని సంపూర్ణంగా పరిశుద్ధపర్చును గాక. మీ ఆత్మ, జీవం, శరీరం మన ప్రభువైన ఏసు క్రీస్తు ఆగమనంలో నిందా రహితంగా, సంపూర్ణంగా ఉండేటట్లు కాపాడబడును గాక" (1 థెస్స 5:23).

## ప్రకటన 20:1–6 యొక్క పద పఠనం

ఈ లేఖన భాగంలో— క్రీస్తువుల్ని హింసిస్తున్న దుష్ట త్రయాన్ని గుర్తుంచుకోవాలి:

1. క్రూర మృగం యొక్క అధికారం – ప్రకటన 13

2. అబద్ధ ప్రవక్త యొక్క అధికారం – ప్రకటన 13:11; 16:13; 19:20

3. మహాసర్పం (dragon) యొక్క అధికారం – ప్రకటన 12; 20.

1 వచనం: "**ఒక దేవ దూత పరలోకం నుండి దిగి రావడం చూసాను**" —— "**దేవదూత**" —— పరలోక దూతను సూచిస్తోంది. "**అగాధం యొక్క తాళపుచెవి**" —— "తాళపుచెవి" అధికారానికి ప్రతీక, ఇది పోపు యొక్క అధికారం ద్వారా ప్రపంచాన్ని ఇంత కాలం ఆధిపత్యం చేసిన సాతాను శక్తిని అణచివేసే హక్కును సూచిస్తుంది. "**పెద్ద సంకెళ్ళు**" —— అంటే ప్రతిరోధం, సాతాను యొక్క ప్రబల శక్తిని అధికమించి ఆటంకం లేకుండా సువార్తకు స్వేచ్ఛగా లోబడవచ్చు.

2 వచనం: "**సాతాను అనే ఆ మహాసర్పం**" —— ఆ "ప్రాచీన సర్పం" అంటే అపవాది, ఏదేను ప్రారంభం నుండి మోసగాడే; అన్యత్వం (paganism), రోమనత్వం (Romanism) యొక్క శక్తి "వెయ్యి సంవత్సరాలు" అదుపు చేయబడుతుంది, అటు పిమ్మట సాతాను విడిచిపెట్టబడతాడు. కాని చివరికి అగ్నిలో వేయబడతాడు. అపవాది యొక్క శక్తి, అధికారం, ప్రభావం నియంత్రించబడుతుంది.

"**వెయ్యేండ్లు**" —— సంపూర్ణ సంఖ్య. సుదీర్ఘ కాలం. ఇది అక్షరార్థమైన కాలం కాదు. "ప్రభువు దృష్టికి ఒక దినం వెయ్యి సంవత్సరాల వలె, వెయ్యి సంవత్సరాలు ఒక దినం వలెను ఉన్నాయి."

3 వచనం: "**ఇక జనాల్ని మోసపరచకుండా అగాధాన్ని మూసి దానికి ముద్ర వేసాడు.**" క్రీస్తు తన విముక్తి చర్య (redemptive act) ద్వారా సర్పం యొక్క తలను నలుగగొట్టాడు. ఆ విధంగా, "అపవాది యొక్క

క్రియల్ని క్రీస్తు నాశనం చేస్తాడని స్పష్టమైంది" (1 యోహాను 3:8); "ఇప్పుడు ఈ లోక అధికారి తరిమివేయబడతాడు" (యోహాను 12:31); "ఈ లోక అధికారికి తీర్పు తీర్చబడింది" (యోహాను 16:11). శక్తివంతుడైన సాతాను బంధింపబడ్డాడు (మత్తయి 12:26, 29). "**వాడు కొంచెం కాలం విడిచిపెట్టబడాలి**." "ఈ ప్రపంచం ఉన్నంత కాలం" అని దీనికి అర్థం. మీ హృదయం రణరంగం; పాపంతో యుద్ధం చేయండి.

4 వచనం: "**అంతట సింహాసనాన్ని చూసాను; వాటి మీద ఆసీనులై ఉండే వారికి విమర్శచేసే అధికారం ఇవ్వబడింది**." ఈ జీవితంలో క్రీస్తువుల స్థానాన్ని ఇది వివరిస్తోంది. వారు సింహాసనాలపై కూర్చుంటారు; అంటే వారు క్రీస్తుతో రాజ్యం చేస్తారు. లోకంలో వారి ప్రవర్తన ద్వారా తీర్పు ఇవ్వబడుతుంది. విమోచించబడినవారు రాజులుగా చేయబడ్డారు, పరిపాలన చేస్తారు (ప్రకటన 5:10). పౌలు ఇట్లన్నాడు: మనం "క్రీస్తు ద్వారా పరలోక విషయాల్లో ఆత్మ సంబంధమైన అన్ని ఆశీర్వాదాలు అనుగ్రహింపబడ్డాయి" (ఎఫెసీ 1:3). ఆయన పాలనలో "అపొస్తలులు సింహాసనాలు అధిరోహిస్తారు" అని క్రీస్తు ప్రకటించారు (మత్తయి 19:27,28; లూకా 22:28–30). పెన్తెకొస్తు దినాన ఆరంభమైన ఈ పాలన క్రీస్తు ప్రత్యక్షమయ్యే వరకు కొనసాగుతుంది. భూసంబంధమైన క్రీస్తు రాజ్యం భవిష్యత్తులో రాదు. క్రీస్తు రాజ్యంలో పౌరసత్వాన్ని పొంది ఆయన వాగ్దానం చేసిన అన్ని ప్రయోజనాలతో మనం ఇప్పుడు ఆనందించవచ్చు. "**దేవుని వాక్కు ప్రకటించి నందుకు శిరచ్ఛేదనం చేయబడినవారి ఆత్మల్ని చూసాను**." —— ఆత్మలు. శరీరాలు కాదు. కొందరు బోధిస్తున్నట్లు శారీరక

పునరుత్థానం కాదు. "**క్రూరమృగానికి**" పూజింప నందుకు హతులైన పరిశుద్ధులుల్ని యోహాను చూసాడు. క్రీస్తు విషయమైన "సాక్ష్యం" కొరకు వారు తమ జీవితాల్ని అర్పించారు. "వారు బ్రతికినవారై, వెయ్యి సంవత్సరాలు క్రీస్తుతో కూడ రాజ్యం చేసారు." ఆత్మలు ఎన్నడూ మరణించవు. ఈ పరిశుద్ధులకు ఆత్మీయ మరణం లేదు.

5 వచనం: "**మొదటి పునరుత్థానం**." పాపం నుండి సువార్త ఇచ్చే అద్భుతమైన జీవితాన్ని "మొదటి పునరుత్థానం" సూచిస్తోంది. "క్రీస్తు ఏసు లోనికి నిమజ్జనం (బాప్టిజో) పొందిన మనం అందరం ఆయన మరణం లోనికి నిమజ్జనం పొందామని మీకు తెలియదా? గనుక తండ్రి మహిమ వలన క్రీస్తు మృతుల్లో నుండి ఎట్లు **లేపబడ్డాడో**, అట్లనే మనం కూడ **నూతన జీవం** పొందినవారమై నడుచుకొనేటట్లు, మనం నిమజ్జనం వలన మరణంలో పాల్పొందటానికి ఆయనతో కూడ పాతిపెట్టబడ్డాం. మరియు ఆయన మరణం యొక్క సాదృశ్యంలో ఆయనతో ఐక్యం గలవారమైతే, ఆయన **పునరుత్థానం** యొక్క సాదృశ్యంలోను ఆయనతో ఐక్యం గలవారమై ఉంటాం" (రోమీ 6:3–5). "మీరు **నిమజ్జనం**లో ఆయనతో కూడ **పాతిపెట్టబడిన**వారై ఆయన్ని మృతుల్లో నుండి లేపిన దేవుని ప్రభావంలో విశ్వసించడం ద్వారా ఆయనతో కూడ **లేచారు**" (కొలొస్స 2:12). క్రీస్తు మరణ సమాధి పునరుద్ధానంలో పాల్పొందటం అనేది క్రీస్తు లోనికి నిమజ్జనం (immersion) ద్వారానే సాధ్యం. యోహాను ఇట్లు వివరించాడు: "నా వాక్కుని వినేవాడు ... నిత్య జీవం కలిగి ఉన్నాడు, అతడు తీర్పులోనికి రాకుండా మరణంనుండి జీవం లోనికి దాటి ఉన్నాడు" (యోహాను 5:24);

"మనం మరణం నుండి జీవం లోనికి దాటి ఉన్నాం" (1 యోహాను 3:14). "ఇదియే మొదటి పునరుత్థానం. ఈ మొదటి పునరుత్థానంలో భాగస్తులైనవారు ధన్యులు పరిశుద్ధులునై ఉంటారు."

"నేను ఏ ఉపదేశ రూపంగా సువార్త మీకు ప్రకటించానో ఆ ఉపదేశాన్ని మీరు గట్టిగా పట్టుకొంటే, ఆ **సువార్త** వలనే మీరు రక్షణ పొందుతారు. నాకు ఇవ్వబడిన ఉపదేశాన్ని మొదట మీకు అప్పగించాను. అది ఏమంటే— లేఖనాల ప్రకారం క్రీస్తు మన పాపాల కొరకు **మృతిపొందారు**, **సమాధి** చేయబడ్డారు, లేఖనాల ప్రకారం మూడవ రోజున **లేపబడ్డారు**" (1 కొరింథీ 15:2–4). సువార్త ఇదే. దీనికి మరణ సమాధి పునరుత్థానాలకు సాదృశ్యంగా జల నిమజ్జనంలో పాల్పొందటమే సువార్తకు లోబటటం "మీరు నిమజ్జనంలో ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయన్ని మృతుల్లో నుండి లేపిన దేవుని ప్రభావంలో విశ్వసించడం ద్వారా ఆయనతో కూడ **లేచారు**" (కొలొస్స 2:12). క్రీస్తు లోనికి "నిమజ్జనం" పొందిన క్రీస్తువులు అందరు పునరుత్థానులైన పరిశుద్ధులే. వీరు మొదటి పునరుత్థానం పొందారు.

6 వచనం: "**ఇట్లాంటి వారి మీద రెండవ మరణానికి అధికారం లేదు**." మరణం అంటే "ఎడబాటు" (separation). పరలోక వారసులకు తీర్పులో దేవుని నుండి ఎడబాటు లేదు. ఏసు ఇట్లన్నారు: "పునరుత్థానం జీవం నేనే; నా యందు విశ్వాసం ఉంచేవాడు చనిపోయినా **బ్రతుకుతాడు**. బ్రతికి నా యందు విశ్వసించే ప్రతివాడు ఎన్నటికిని చనిపోడు" (యోహాను 11:25,26). దేవుని యెడల విశ్వాసం, ఆరాధన ద్వారా, పరిచర్య వలన

**“దేవునికి క్రీస్తుకు యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి ఏండ్లు రాజ్యం చేస్తారు.”** క్రీస్తువులు అందరు యాజకులే (1 పేతురు 2:9; ప్రకటన 1:5,6). తమరి పరలోక ప్రయాణం అంతటిలో ప్రభువు తమకు తోడై ఉండును గాక!

దైవ స్థాయి సత్యవంతునిగా జీవించు
క్రీస్తు స్థాయి పాప రహితునిగా బ్రతుకు
ప్రపంచ స్థాయి మానవునిగా కొనసాగు
దైవ వాక్కు స్థాయి క్రీస్తువునిగా ప్రవర్తించు!

## పునరుత్థాన దేహం

“మన పౌరసత్వం (*politeuo*) పరలోకంలో ఉంది. అక్కడ నుండి ప్రభువైన ఏసు క్రీస్తు అనే రక్షకుడు వస్తాడని నిరీక్షిస్తున్నాం. సమస్తాన్ని తనకు లోపరచుకొనకల్గే శక్తి వలన ఆయన మన **దీన** శరీరాన్ని తన **మహిమ** కల్గిన శరీరానికి **సమరూపం** గలదానిగా మారుస్తాడు” (ఫిలిప్పీ 3:20,21). పరలోకపు పౌరులమైన మనం ఇక్కడ భూమిపై ప్రవాసులుగా, ప్రోషితులుగా, యాత్రికుల్లా జీవిస్తున్నాం.

“భూమి మీద మన నివాసమైన ఈ గుడారం, అనగా మన శరీరం నశించిపోయినా, చేతులతో చేయబడక దేవుని చేత కట్టబడిన నిత్యమైన నివాసం పరలోకంలో ఉంది అని మనకు తెలుసు. కాబట్టి పరలోకం నుండి వచ్చే మన నివాసం దీనిపై ధరించుకొనాలని అపేక్షిస్తూ దీనిలో మూల్గుతున్నాం. అది ధరించినప్పుడు మనం దిగంబరులంగా కన్పించం. ఈ గుడారంలో ఉన్న మనం భారంతో మూల్గుతున్నాం. ఇది తీసివేయబడాలని

కాదు గాని మర్త్యమైనది జీవం చేత మ్రింగివేయబడాలి అని, ఆ నివాసాన్ని దీనిపై ధరించుకోవాలి అని కోరుతున్నాం. దీని నిమిత్తం మనల్ని సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మను ధరావత్తుగా మనకు ఇచ్చాడు. గనుక ఈ దేహంలో నివసించు చున్నంత కాలం ప్రభువుకు దూరంగా ఉన్నామని తెలుసు. ఎల్లప్పుడు ధైర్యంగా ఉన్నాం. వెలిచూపు వలన కాక విశ్వాసం వలనే నడుచు కొంటున్నాం. ఇట్లు ధైర్యం కల్గి ఈ దేహాన్ని విడిచిపెట్టి ప్రభువుతో నివసించాలని అపేక్షిస్తున్నాం. కావున దేహమందు జీవిస్తున్నా దేహాన్ని విడిచిపెట్టినా, ఆయనకు ఇష్టులమై ఉండాలని మిగుల అపేక్షిస్తున్నాం. ఎందుకంటే, ఈ దేహంతో మనం ఉండగా చేసిన క్రియల్ని బట్టి, అవి మంచివైనా చెడ్డవైనా, దేహంతో చేసిన వాటి ప్రతిఫలాన్ని పొందటానికి మనం అందరం క్రీస్తు న్యాయపీఠం ఎదుట ప్రత్యక్షంగా కన్పించాలి. కనుక ప్రభువుకు భయపడటం అంటే ఏమిటో మాకు తెలిసినందు వలన  మనుష్యుల్ని ప్రోత్సహిస్తున్నాం. మేము దేవునికి బాగా తెలుసు, మీ మనస్సాక్షికి కూడా బాగా తెలుసు అని నమ్ముతున్నాను" (2 కొరింథీ 5:1–11).

'"మృతులు ఎట్లు లేస్తారు? వారు ఎట్లాంటి శరీరంతో వస్తారు' అని ఒకరు అడుగవచ్చు. ఓ అవివేకీ, నీవు విత్తింది చస్తేనే గాని బ్రతుకదు గదా. నీవు విత్తే దాన్ని చూస్తే అది గోధుమగింజైనా మరి ఏ గింజైనా సరే, వట్టి గింజనే విత్తుతున్నావు. గాని పుట్టబోయే శరీరాన్ని విత్తటం లేదు. అయితే దేవుడే తన చిత్తప్రకారం నీవు విత్తిన దానికి శరీరాన్ని ఇస్తాడు. మరియు ప్రతి విత్తనానికి దాని దాని శరీరం ఇస్తున్నాడు. మాంసం అంతా ఒకే విధమైంది

కాదు. మనుష్య మాంసం వేరు, మృగ మాంసం వేరు, పక్షి మాంసం వేరు, చేప మాంసం  వేరు. మరియు ఆకాశ వస్తు రూపాలు ఉన్నాయి, భూ వస్తు రూపాలు ఉన్నాయి; ఆకాశ వస్తు రూపాల మహిమ వేరు, భూ వస్తు రూపాల మహిమ వేరు. సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రాల మహిమ వేరు. మహిమను బట్టి ఒక నక్షతరానికి మరొక నక్షత్రానికి వ్యత్యాసం ఉంది గదా. మృతుల పునరుత్థానం కూడ ఆలాగే. శరీరం క్షయమైనదిగా విత్తబడి అక్షయమైందిగా లేపబడుతుంది. ఘనహీనమైనదిగా విత్తబడి మహిమగలదిగా లేపబడుతుంది; బలహీన మైందిగా విత్తబడి, బలమైనదిగా లేపబడుతుంది; ప్రకృతి సంబంధమైన శరీరంగా విత్తబడి ఆత్మసంబంధ శరీరంగా లేపబడుతుంది. ప్రకృతి సంబంధమైన శరీరం ఉంది గనుక ఆత్మ సంబంధమైన శరీరం కూడ ఉంది. ఈ విషయంలో— 'ఆదాం అనే మొదటి మనుష్యుడు **జీవించే ప్రాణి** అయ్యాడు' అని వ్రాయబడింది. కడపటి ఆదాం **జీవింపజేసే ఆత్మ** అయ్యాడు. ఆత్మ సంబంధమైంది మొదట కలుగలేదు, ప్రకృతి సంబంధమైందే మొదట కల్గింది; తరువాత ఆత్మసంబంధమైంది వచ్చింది. మొదటి మనుష్యుడు భూ సంబంధియై మంటి నుండి పుట్టాడు, రెండవ మనుష్యుడు పరలోకం నుండి వచ్చాడు. మంటి నుండి పుట్టిన వాడు ఎట్లాంటి వాడో మంటి నుండి పుట్టిన వారు కూడ అట్లాంటి వారే, పరలోక సంబంధి ఎట్లాంటి వాడో పరలోక సంబంధులు కూడ అట్లాంటి వారే. మరియు మనం మంటి నుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారం పరలోక సంబంధి పోలికను ధరిస్తాం. సోదరులారా, నేను చెప్పేది  ఏమంటే, రక్తమాంసాలు దేవుని

రాజ్యాన్ని స్వతంత్రించుకో నేరవు; క్షయత అక్షయతను స్వతంత్రించుకోదు. ఇదిగో మీకు ఒక మర్మం చెబుతున్నాను; మనం అందరం నిద్రించం గాని క్షణంలో, ఒక రెప్పపాటులో, తుది బూర మ్రోగగానే మనం అందరం మార్పుపొందుతాం. బూర మ్రోగుతుంది; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడతారు, మనం మార్పు పొందుతాం. క్షయమైన ఈ శరీరం అక్షయతను ధరించుకోవాలి; మర్త్యమైన ఈ శరీరం అమర్త్యతను ధరించుకోవాలి. ఈ క్షయమైంది అక్షయతను ధరించుకొన్నప్పుడు, ఈ మర్త్యమైంది అమర్త్యతను ధరించుకొన్నప్పుడు, 'విజయంలో మరణం మ్రింగివేయ బడింది' అని వ్రాయబడిన వాక్కు నెరవేరుతుంది. 'ఓ మరణమా, నీ విజయం ఎక్కడ? ఓ మరణమా, నీ ముల్లు ఎక్కడ? మరణపు ముల్లు పాపం; పాపానికి ఉన్న బలం ధర్మశాస్త్రమే. మన ప్రభువైన ఏసు క్రీస్తు మూలంగా మనకు **జయం** అనుగ్రహిస్తున్న దేవునికి స్తోత్రం కల్గును గాక. కాగా నా ప్రియ సోదరులారా, మీ ప్రయాసం ప్రభువులో వ్యర్థం కాదని తెలిసి, స్థిరులు, కదలనివారు, ప్రభువు కార్యాభివృద్ధిలో ఎప్పటికి ఆసక్తులై ఉండండి" (1 కొరింథీ 15:35–58). తమరి జీవితాన్ని ప్రభువును ఏలనియ్యండి. ప్రేమ, సత్యం, పరిశుద్ధత మీ జీవితాన్ని అత్యున్నతంగా ఏలితే— దైవ వాక్కు మీలో సజీవమై శక్తివంతంగా ఉంటుంది. "ఆయన్ని **ప్రేమించేవారు** బలంతో ఉదయించే సూర్యునిలా ఉంటారు" (న్యాయాధి 5:31). పౌలు ఇట్లు వ్రాసాడు: "ప్రభువును **ప్రేమించనివాడు** శాపగ్రస్తుడు" (1 కొరింథీ 16:22). తమరు ప్రభువును ప్రేమిస్తున్నారా?

తమరు కూడ దేవునితో నడవాలని ఆశిస్తే, ఆయన సింహాసనాన్ని ఆశించ వద్దు. "మనుష్య కుమారుడు తన మహిమతో ఆయనతో కూడ సమస్త దూతలు వచ్చినప్పుడు ఆయన తన మహిమగల సింహాసనం మీద ఆసీనుడై ఉంటాడు ... వీరు [ఎడమ వైపున ఉన్న వారు] నిత్య శిక్షకు, [కుడి వైపున ఉన్నవారు] నీతిమంతులు నిత్యజీవానికి వెళ్తారు" (మత్తయి 25:31–46). "కాబట్టి మీ మనస్సు అనే నడుం కట్టుకొని నిబ్బరమైన బుద్ధిగలవారై, ఏసు క్రీస్తు **ప్రత్యక్ష**మైనప్పుడు మీకు ఇవ్వబోయే కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కల్గి ఉండండి" (1 పేతురు 1:13). "ఇదిగో, త్వరగా వస్తున్నాను; వాని వాని క్రియల ప్రకారం ప్రతి వ్యక్తికి ఇవ్వడానికి నేను సిద్ధపర్చిన జీతం నా దగ్గర ఉంది" (ప్రకటన 22:12). మత్తయి 24:44 ఇట్లు హెచ్చరిస్తోంది—— "ఏ రోజున మీ ప్రభువు వస్తారో మీకు తెలియదు. గనుక మెలకువగా ఉండండి."

"అంత్య దినమందు దూత – బూర నూదు చుండగా
నిత్యవాసరంబు తెల్లవారగా – రక్షణందుకొన్నవారి
పేర్లు పిల్చుచుండగా – నేను కూడ చేరి యుందు నచ్చట
నేను కూడ చేరి యుందు – నేను కూడ చేరి యుందు
నేను కూడ చేరి యుందు – నేను కూడ చేరి యుందు నచ్చట!"

❖

రాజాధి రాజు నీవే – రాజులకు రాజువు నీవే
రాజ్య మేలు చున్న ప్రభు నీవే – రవి కోటి తేజ ఏసు నీవే!
ఓ ... మేఘ వాహనంబు మీద వేగమే
ఓ ... అధిక వైభవంబు తోడ వేగమే!

ఓ ... భూ జనంబు లెల్ల తేరి చూడగా
ఓ ... నీ జనంబు స్వాగతంబు నీయగా
నీ రాజ్యం తండ్రి కప్పగింప – తుది తీర్పుతీర్చ నీవే
భూమి ఆకసంబు మారిపోవ – నీ మహా ప్రభావమున వేగ!

ఆ ... ఆకసమున దూత లార్భటింపగా
ఆ ... ఆది భక్త సంఘ సమేతంబుగా
ఆకసంబు మధ్య వీధిలోన ఏకమై మహా సభ జేయ
ఏసు నాథ నీదు మహిమ లోన– మా కదే మహానంద మౌగ!

ఓ ... పరమ ఎరుషలేము పుణ్య సంఘమా!
ఓ ... గొర్రెపిల్ల క్రీస్తు సంఘమా – పరమ దూతలార!
భక్తులారా పౌలు అపొస్తులార పెద్దలారా!
గొర్రెపిల్ల ఏసు రాజు పేర – క్రొత్త గీత మెత్తి పాడ రారా!

# సహస్రాబ్ది స్వామ్యం

ప్రభువు వచ్చినప్పుడు ఆయన భూమిపై అడుగు మోపునా?